


# మన దునియా

RNI Number
TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం



రిపోర్టర్లు కావలెను

మన దునియా

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

మన దునియా

ఇంకెందుకు ఆలస్యం...
9490056011,9603969335



సంపుటి : 3 | సంచిక : 229 | మార్చ్ 6 శుక్రవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


# రవాణాశాఖలో అవినీతి జలగలు

## ఒక్కరోజు సంపాదన రూ. 2 లక్షలు ?

### పాఠశాలల ప్రారంభంలో పండగే..?




## తిరుపతిలో కవిత నోట 'జై ఆంధ్ర' నినాదం

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనానికి వచ్చిన కవిత

రేణిగుంట విమానాశ్రయంలో జై ఆంధ్ర అంటూ నినాదం

తన పార్టీకి స్వామి వారి ఆశీస్సులు ఉంటాయని నమ్ముతున్నానని వ్యాఖ్య



## తెలంగాణలో భానుడి భగభగ...

### ములుగులో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

పెరుగుతున్న పగటిపూట ఉష్ణోగ్రతలు

ఆదిలాబాద్, ఖమ్మం, జగిత్యాలలో అత్యధిక ఉష్ణోగ్రతలు

వృద్ధులు, పిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచన



## యుద్ధంతో సమస్యలు పరిష్కారం కావు: ప్రధాని మోదీ

చర్చలు, దౌత్యంతోనే సమస్యలకు పరిష్కారం అని ఉద్ఘాటన

ఉగ్రవాద నిర్మూలనే ఇరువురి ఉమ్మడి లక్ష్యం అని ప్రకటన



వలసలు, మొబిలిటీపై భారత్, ఫిన్లాండ్ కీలక ఒప్పందం

విద్యా రంగంలో పరస్పర సహకారానికి నిర్ణయం

## తెలంగాణకు ఐపీఎస్ అధికారుల సంఖ్య పెంచాలని కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి..!

**మన దునియా,న్యూఢిల్లీ:మార్చి 05**

తెలంగాణ రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ఐపీఎస్ అధికారుల సంఖ్యను పెంచి కేటాయించాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను కోరారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా ఆయన అమిత్ షాతో భేటీ అయి రాష్ట్ర పోలీసింగ్‌కు సంబంధించిన పలు ముఖ్య అంశాలను చర్చించారు.రాష్ట్ర విభజన అనంతరం 2016లో మొదటి క్యాడర్ రివ్యూ జరిగిందని, 2021లో జరగాల్సిన రెండో క్యాడర్ రివ్యూ ఆలస్యంగా 2025లో నిర్వహించారని



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## తెలంగాణలో భానుడి భగభగ...

## ములుగులో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగతో పగటిపూట ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. మార్చి మొదటి వారంలోనే ఎండలు తీవ్రస్థాయికి చేరుకుంటున్నాయి. గురువారం ములుగు జిల్లా మంగపేటలో అత్యధికంగా 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్, ఖమ్మం, జగిత్యాలలో 38.9 డిగ్రీలు, మంచిర్యాలలో 38.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. వృద్ధులు, పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. ములుగు, ఆదిలాబాద్, జగిత్యాల, ఖమ్మం, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, కుమురంభీమ్, నాగర్ కర్నూలు, నిజామాబాద్ తదితర జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్, సిద్దిపేట తదితర జిల్లాల్లో 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

## తిరుపతిలో కవిత నోట 'జై ఆంధ్ర' నినాదం

తెలంగాణ రాజకీయాల్లో తనకంటూ ఒక నూతన ప్రస్థానాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్న కల్వకుంట్ల కవిత తిరుపతి పర్యటనలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రెండు రాష్ట్రాల్లోనూ చర్చనీయాంశంగా మారాయి. కొత్త పార్టీని ప్రకటించబోతున్నట్లు ఇప్పటికే సంకేతాలిచ్చిన ఆమె... తిరుమల శ్రీవారి మొక్కు తీర్చుకోవడానికి కుటుంబ సభ్యులు, జాగృతి నాయకులతో కలిసి తిరుపతికి చేరుకున్నారు. రేణిగుంట విమానాశ్రయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతున్న సమయంలో ఆమె 'జై ఆంధ్ర' అని నినాదం చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. తన రాక సందర్భంగా ఏపీలోని శ్రేయోభిలాషులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వాగతం పలికారని కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలో తాము ప్రారంభించబోతున్న రాజకీయ పార్టీకి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆశీస్సులు ఉంటాయని నమ్ముతున్నానని అన్నారు.మరోవైపు, తనను ఇబ్బంది పెట్టిన కేసుల నుంచి కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంపై కవిత హర్షం వ్యక్తం చేశారు. సత్యం తన వైపు ఉన్నందునే దైవకృపతో కేసుల నుంచి విముక్తి లభించిందని, ఆ మొక్కు తీర్చుకునేందుకే అలిపిరి నుంచి కాలినడకన తిరుమలకు వెళుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా తాను స్థాపించబోయే కొత్త రాజకీయ పార్టీకి శ్రీవారి ఆశీస్సులు ఉంటాయని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణ అస్తిత్వం ప్రాతిపదికగా తన రాజకీయ ప్రయాణం ఉంటుందని చెబుతున్న కవిత, ఏపీలో 'జై ఆంధ్ర' అనడం వెనుక వ్యూహాత్మక కారణాలు ఏమైనా ఉన్నాయా అనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది.ముఖ్యంగా హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న ఏపీ సెటిలర్ల ఓట్లు ఏ ఎన్నికల్లోనైనా కీలకంగా మారుతుంటాయి. ఈ నేపథ్యంలో, వారిని ఆకట్టుకోవడానికి కవిత ఈ నినాదాన్ని వాడుకున్నారా? అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి అలిపిరి మెట్ల మార్గం ద్వారా తిరుమలకు వెళుతున్నారు. రేపు ఉదయం స్వామివారిని దర్శించుకోనున్నారు. ఈ పర్యటన ముగిసిన వెంటనే తన కొత్త పార్టీ పేరు మరియు విధివిధానాలను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

## యుద్ధంతో సమస్యలు పరిష్కారం కావు: ప్రధాని మోదీ

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత్ మరోసారి శాంతి మంత్రం జపించింది. కేవలం సైనిక చర్యలతో ఏ సమస్యా పరిష్కారం కాదని, చర్చలు, దౌత్యమే సరైన మార్గమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. గురువారం నాడు ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం ఇరువురు నేతలు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లలో నెలకొన్న ఘర్షణలను ముగించేందుకు జరిగే ప్రతి ప్రయత్నానికి భారత్ మద్దతు ఇస్తుందని మోదీ హామీ ఇచ్చారు. చట్టం, న్యాయం, ప్రజాస్వామ్య విలువలపై భారత్, ఫిన్లాండ్‌లకు ఒకే రకమైన అభిప్రాయం ఉందని ఆయన తెలిపారు.ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు అత్యవసరమని ఇరువురు నేతలు ఏకాభిప్రాయానికి వచ్చారు. ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లోనూ నిర్మూలించడమే తమ ఉమ్మడి లక్ష్యమని మోదీ పేర్కొన్నారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ 'ఐరన్‌మ్యాన్ ట్రయాథ్లాన్' పూర్తి చేయడాన్ని ప్రస్తావిస్తూ మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "మీరు ఐరన్‌మ్యాన్ ట్రయాథ్లాన్ పూర్తి చేశారు.. మీలాంటి శక్తివంతమైన నాయకత్వంతో భారత్, ఫిన్లాండ్ కూడా ఇన్నోవేషన్, డిజిటల్, సస్టైనబిలిటీ అనే కొత్త 'ట్రయాథ్లాన్'ను సాధిస్తాయని నాకు నమ్మకం ఉంది" అని మోదీ చమత్కరించారు.

కొత్త శకంలో భారత్-యూరప్ బంధం

ప్రస్తుతం ప్రపంచం అస్థిరత, అనిశ్చితి మధ్య ఉందని, ఉక్రెయిన్ నుంచి పశ్చిమాసియా వరకు అనేక ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్నాయని మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచంలోని రెండు పెద్ద దౌత్య శక్తులైన భారత్, యూరప్ మధ్య సంబంధాలు స్వర్ణయుగంలోకి ప్రవేశిస్తున్నాయని ఆయన అభివర్ణించారు. 2026 ప్రారంభంలో కుదిరిన చారిత్రాత్మక 'ఇండియా-యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం' గురించి ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ ఒప్పందం ద్వారా భారత్, ఫిన్లాండ్ మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక సహకారం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కీలక ఒప్పందాలపై సంతకాలు

ఇరు దేశాల మధ్య ఆవిష్కరణల వ్యవస్థను అనుసంధానించేందుకు సమగ్ర 'మైగ్రేషన్ అండ్ మొబిలిటీ' (వలసలు మరియు రాకపోకల) ఒప్పందంపై సంతకాలు చేసినట్లు ప్రధాని ప్రకటించారు. భారతీయ విద్యార్థులకు, ప్రతిభావంతులకు ఫిన్లాండ్ ఇప్పుడు ఒక ప్రాధాన్య గమ్యస్థానంగా మారుతోందన్నారు. ఈ ఒప్పందం వల్ల ఇరు దేశాల మధ్య పరిశోధనలు, స్టార్టప్ సహకారం మరింత బలపడుతుందని తెలిపారు. విద్యా రంగంలో ఫిన్లాండ్ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడిన మోదీ.. ఉపాధ్యాయ శిక్షణ, స్కూల్-టు-స్కూల్ భాగస్వామ్యం, భవిష్యత్ విద్యా విధానాలపై సహకారాన్ని విస్తరించుకోవడానికి అంగీకరించినట్లు వెల్లడించారు. నార్డిక్ ప్రాంతంలో ఫిన్లాండ్ భారత్‌కు ముఖ్యమైన భాగస్వామి అని, ఆర్కిటిక్, ధృవ ప్రాంతాల పరిశోధనల్లోనూ తమ సహకారం కొనసాగుతుందని మోదీ స్పష్టం చేశారు.

# రవాణాశాఖలో అవినీతి జలగలు


...అనేది ఈ క్రింద పట్టికలో

లైసెన్స్ కేటగిరీ

| సర్వీస్ | ప్రభుత్వ ఫీజు |
|---|---|
| లెర్నింగ్ లైసెన్స్ కు | రూ.550 |
| పర్మినెంట్ లైసెన్స్ | రూ.1435 |
| హెవీ లైసెన్స్ | రూ.1700 |
| ట్రాన్స్ పోర్ట్ లైసెన్స్ | రూ.1435 |


కొత్త వాహన రిజిస్ట్రే...

| సర్వీస్ | ప్రభుత్వ ఫీజు |
|---|---|
| టూ వీలర్ | లేదు |
| కార్లు | లేదు |


| | | |
|---|---|---|
| త్రీవీలర్ & ఆటో రిక్షా ప్యాసింజర్ | లేదు | డీటీవోకు రూ.2000 ఎంవీఐకి రూ.600 ఏవోకు రూ.200 క్లర్క్ కు రూ.200 |
| ఎల్ఎంవీ గూడ్స్ | లేదు | డీటీవోకు రూ.200 ఎంవీఐకి రూ.1200 ఏవోకు రూ.200 క్లర్క్ కు రూ.200 |
| | | డీటీవోకు రూ.800 |


| | | |
|---|---|---|
| | | రూ.200 |
| ట్రాక్టర్ ట్రాలీ | లేదు | డీటీవోకు రూ.800 ఎంవీఐకి రూ.1500 ఏవోకు రూ.300 క్లర్క్ కు రూ.300 |
| మోటార్ క్యాబ్ | లేదు | డీటీవోకు రూ.2200 ఎంవీఐకి రూ.1400 ఏవోకు రూ.500 క్లర్క్ కు రూ.500 |
| | | డీటీవోకు |


| | | |
|---|---|---|
| మీడియం గూడ్స్ వెహికల్ | లేదు | డీటీవోకు రూ.2200 ఎంవీఐకి రూ.2200 ఏవోకు రూ.500 క్లర్క్ కు రూ.500 |
| హెవీ గూడ్స్ వెహికల్ | లేదు | డీటీవోకు రూ.3200 ఎంవీఐకి రూ.5500 ఏవోకు రూ.1000 క్లర్క్ కు రూ.1000 |
| | | డీటీవోకు రూ.2200 |


| | | |
|---|---|---|
| | | రూ.1000 |
| జెసిబి | లేదు | డీటీవోకు రూ.2200 ఎంవీఐకి రూ.2400 ఏవోకు రూ.500 క్లర్క్ కు రూ.500 |
| హార్వెస్టర్ | లేదు | డీటీవోకు రూ.5500 ఎంవీఐకి రూ.2400 ఏవోకు రూ.1000 క్లర్క్ కు రూ.1000 |


ఫిట్ నెస్

| సర్వీస్ | ప్రభుత్వ ఫీజు | లంచం |
|---|---|---|
| ఆటో రిక్షా | రూ.700 | ఎంవీఐకి రూ.400 క్లర్క్ కు రూ.100 |
| ఎల్ఎంవీ గూడ్స్ | రూ.900 | ఎంవీఐకి రూ.1000 క్లర్క్ కు రూ.100 |
| ట్రాక్టర్, ట్రాలీ | రూ.900 | ఎంవీఐకి రూ.1400 క్లర్క్ కు రూ.100 |


| | | |
|---|---|---|
| మోటార్ క్యాబ్ | రూ.900 | ఎంవీఐకి రూ.900 క్లర్క్ కు రూ.100 |
| మీడియం గూడ్స్ వెహికల్ | రూ.1100 | ఎంవీఐకి రూ.1800 క్లర్క్ కు రూ.100 |
| హెవీ గూడ్స్ వెహికల్ | రూ.1100 | ఎంవీఐకి రూ.2200 క్లర్క్ కు రూ.100 |


| | | |
|---|---|---|
| ట్రాక్టర్, ట్రాలీ | రూ.900 | రూ.1400 క్లర్క్ కు రూ.100 |
| మోటార్ క్యాబ్ | రూ.900 | ఎంవీఐకి రూ.900 క్లర్క్ కు రూ.100 |
| మీడియం గూడ్స్ వెహికల్ | రూ.1100 | ఎంవీఐకి రూ.1800 క్లర్క్ కు రూ.100 |
| హెవీ గూడ్స్ వెహికల్ | రూ.1100 | ఎంవీఐకి రూ.2200 క్లర్క్ కు రూ.100 |

**మన దునియా వరంగల్ జిల్లా:మార్చి 05**

వరంగల్ జిల్లాలో అవినీతికి అలవాటు పడ్డ రవాణా శాఖ అధికారుల అక్రమ ఆదాయం రోజుకు రూ.20 లక్షలు పైమాటే అనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఆఫీస్ పరిసరాల్లోని ఏజెంట్ల ద్వారా పనులు చక్కబెడుతున్న అధికారులు..వారి స్థాయిని బట్టి వాటాలు పంచుకున్నట్లు సమాచారం.కొన్నేండ్లుగా ఈ లంచాల వ్యవహారం అటెండర్ నుంచి అధికారి వరకు యథేచ్ఛగా సాగుతుందనేది బహిరంగం రహస్యమే! అయినప్పటికీ అధికారుల అక్రమ దందాపై శాఖాపరంగా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఈ క్రమంలో అధికారుల నెలవారీ అక్రమ సంపాదనతో కోట్లకు పడగలెత్తారంటే ఆశ్చర్యం కలగకమానదు.ఒక్క వరంగల్ జిల్లాలో ఇలాంటి పరిస్థితి ఉంటే రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖలో అవినీతి ఏ స్థాయిలో జరుగుతుందో చెప్పాల్సిన పని లేదు.

**ఒక్కరోజు సంపాదన రూ. 2 లక్షలు ?**

రవాణాశాఖలో వాహనదారులకు లైసెన్సు, వాహనాల రిజిస్ట్రేషన్లు, ఫిట్నెస్ సర్టిఫికెట్ల జారీ, తదితర కార్యకలాపాల కోసం ఆన్లైన్ సేవలు అందుబాటులో ఉన్నాయి. కానీ ఏజెంట్ల ద్వారా వెళ్తేనే ఎలాంటి పనైనా వెంటనే పూర్తయ్యే అవకాశం ఉంది. ఇందుకోసం ఏజెంట్ అడిగినంత ముట్టజెప్పాల్సిందే. ఉదాహరణకు లెర్నింగ్, పర్మినెంట్ లైసెన్స్ జారీకి సర్కార్ నిర్ణయించిన ఫీజు రూ.1900 ఆన్లైన్లో చెల్లించాల్సి ఉంటుంది. ఏజెంట్ మాత్రం అదనంగా రూ. 2100 తీసుకుని ఎలాంటి పరీక్ష లేకుండా లైసెన్స్ జారీ చేయిస్తాడు. లైసెన్స్ జారీ చేసే ఎంవీఐ (మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ )కు రూ.1400 ముట్టజెప్పి సదరు ఏజెంట్ రూ. 700 కమీషన్ తీసుకుంటాడు. టూ వీలర్ రిజిస్ట్రేషన్కు ఎలాంటి ఫీజు లేకపోయినప్పటికీ వాహనదారుడు రూ. 400 లు చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో రూ. 200 ఎంవీఐ, రూ. 100 , క్లర్క్ రూ. 100 సూపరింటెండెంట్ తీసుకోవడం కొంతకాలంగా ఆనవాయితీగా వస్తోంది. ఈ మాదిరిగా జిల్లాలో రోజుకు 700 లైసెన్సు, 600 వాహనాలకు రిజిస్ట్రేషన్లు జారీ చేస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.ఈ నేపథ్యంలో రెండు పనులకు గానూ రూ. 10 లక్షలకు పైగా లంచాల రూపంలో వసూలు చేస్తున్నారనే విషయం స్పష్టమవుతోంది. వీటికితోడు వాహనాల ఫిట్నెస్లు,పేర్ల మార్పిడి,ఓవర్ లోడ్ వెహికల్కు ఫైన్ల పేరిట అదనంగా మరో రూ.10 లక్షలు గుంజుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు.ఒక జిల్లాలో ఎంవీఐగా విధులు నిర్వహిస్తున్న అధికారి రోజువారీ అవినీతి సంపాదన రూ. 2 లక్షలకు పైనే ఉంటుందని తెలుస్తోంది. ఈ లెక్కన వరంగల్ జిల్లాలో రవాణా శాఖ అధికారుల నెలవారీ అవినీతి సంపాదన రూ. 10 కోట్ల దాటిందనే ప్రచారం జరుగుతోంది.

**పాఠశాలల ప్రారంభంలో పండగే..?**

ప్రతి ఏడాది జూన్ లోపు పాఠశాలల ప్రారంభానికి ముందు రవాణాశాఖ అధికారులు పండగ చేసుకుంటారు.జిల్లాలోని పాఠశాలలు, తప్పనిసరిగా ఫిట్ నెస్ కళాశాలల సామర్థ్యాన్ని బస్సులు చెక్ చేయించుకోవాల్సి ఉంటుంది. స్కూల్ యాజమానులు జిల్లాకు సంబంధించిన రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లి బస్సుల ఫిట్నెస్ పరీక్షించుకోవాలి. ఇందుకుగానూ రూ. 800 ఫీజు చెల్లిస్తే సరిపోతుంది. కానీ ఇక్కడ చేతి వాటం ప్రదర్శించే అధికారులు బస్సుకు అదనంగా రూ.3300 వసూలు చేస్తారని తెలుస్తోంది. జిల్లాలో సుమారు 4 వేల బస్సులు ఉన్నాయి.ఈ మేరకు బస్సుల ద్వారా ప్రతీ ఏడాది జూన్ మాసంలో కోటికి పైగా ఆదాయం సమకూరుతున్నట్లు సమాచారం. దీనికితోడు జిల్లాల్లో ఇసుక, గ్రానైట్ రవాణా చేసే లారీలు పెద్దసంఖ్యలో తిరుగుతున్నాయి. లారీలు ఓవర్ లోడ్తో ప్రయాణిస్తున్నందున రోడ్లు దెబ్బతినడంతో పాటు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వీటిని నివారించేందుకు అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించాలి.కానీ లారీ యాజమానుల నుంచి నెలవారీ మామూళ్లు తీసుకుని నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి.ఫలితంగా ప్రభుత్వ ఖజానాపై భారం పడుతోంది.రవాణాశాఖలో పెద్దమొత్తంలో అవినీతి జరుగుతున్నప్పటికీ ఏసీబీ, మీడియా పట్టించుకోకుండా ఉండేందుకు గానూ ఆయా వర్గాలను మేనేజ్ చేస్తున్నారనే ప్రచారమూ లేకపోలేదు. అక్రమంగా సంపాదించిన సొమ్ముతో బినామీల పేరిట ఆస్తులు కూడబెట్టుకుంటూ ప్రతీ ఏడాది మార్చిలో ప్రభుత్వానికి తప్పుడు ఆదాయ లెక్కలు చూపుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

## తెలంగాణకు ఐపీఎస్ అధికారుల సంఖ్య పెంచాలని కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి..!

సీఎం గుర్తుచేశారు. ఆ సమయంలో తెలంగాణకు కేవలం ఏడుగురు ఐపీఎస్ అధికారులనే అదనంగా కేటాయించారని తెలిపారు.దేశంతో పాటు తెలంగాణ రాష్ట్రం కూడా సైబర్ నేరాలు, డ్రగ్స్, వైట్ కాలర్ నేరాలు వంటి ఆధునిక సవాళ్లను ఎదుర్కొంటోందని సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పునర్వ్యవస్థీకరణ, ఫ్యూచర్ సిటీ కమిషనర్ వ్యవస్థ ఏర్పాటుతో పాటు హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న జనాభా దృష్ట్యా మరింత మంది ఐపీఎస్ అధికారుల అవసరం ఉందని వివరించారు.ప్రస్తుతం రాష్ట్రంలో 83 మంది ఐపీఎస్ అధికారులు ఉన్నారని, ఆ సంఖ్యను 103కు పెంచాలని కోరుతూ 2026లో జరగాల్సిన మూడో క్యాడర్ రివ్యూను నిర్దేశిత సమయంలోనే చేపట్టాలని కేంద్రాన్ని సీఎం అభ్యర్థించారు.ఈ భేటీలో మావోయిస్టుల లొంగుబాటు అంశంపైనా చర్చ జరిగింది. గత రెండేళ్లలో తెలంగాణ పోలీసింగ్‌లో గణనీయమైన మార్పులు వచ్చాయని సీఎం తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 591 మంది మావోయిస్టులు ఆయుధాలను వదిలి జనజీవన స్రవంతిలో కలిసినట్లు వివరించారు. ఇటీవల పలువురు మావోయిస్టు అగ్రనేతలు కూడా సాధారణ జీవితాన్ని గడపడానికి ముందుకు వచ్చారని, వారికి నిబంధనల ప్రకారం పునరావాసం, పరిహారం అందిస్తున్న విషయాన్ని కేంద్ర మంత్రికి వివరించారు.అలాగే రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించి సహకరించాలని కూడా సీఎం కోరారు.ఈ సమావేశంలో ముఖ్య మంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ వి. శేషాద్రి, రాష్ట్ర డీజీపీ బి.శివధర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ అదనపు డీజీపీ విజయ్ కుమార్, ఎస్ఐబి ఐజీపీ బి.సుమతి పాల్గొన్నారు.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
మార్చ్ । శుక్రవారం । 6 । 2026



# బిహార్ సీఎం సంచలన ప్రకటన.. నేడే రాజ్యసభకు నామినేషన్!

**మన దునియా,బిహార్:మార్చి 05**

ఇంటర్నెట్‌డెస్క్: జేడీయూ అధ్యక్షుడు, బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ రాజ్యసభకు వెళ్లనున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా 'ఎక్స్' వేదికగా ధ్రువీకరించారు. దీంతో ఆయన త్వరలోనే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నట్లు సంకేతాలు వస్తున్నాయి. ఇప్పటివరకు తాను మూడు సభల్లో సభ్యుడిగా ఉన్నానని, రాజ్యసభ సభ్యుడిగానూ సేవలందించి 'నాలుగు సభల క్లబ్'లో చేరాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.'రెండు దశాబ్దాలుగా మీరు నన్ను నమ్మి ఎంతో మద్దతిచ్చారు. అంకితభావంతో నా నేను విధుల్ని నిర్వర్తించాను. మీ మద్దతు, నమ్మకం వల్లే బిహార్ అభివృద్ధిలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోంది. నా పార్లమెంటరీ జీవితం ప్రారంభించినప్పటి నుంచి నా మనసులో ఓ కోరిక ఉంది. రాష్ట్ర స్థాయిలో రెండు చట్టసభలతో పాటు పార్లమెంట్‌లోని ఉభయ సభలకు ప్రాతినిధ్యం వహించాలనుకున్నాను. అందుకే త్వరలో జరగనున్న ఎన్నికల్లో రాజ్యసభ సభ్యుడిగా నా ప్రయాణాన్ని ప్రారంభించాలి అనుకుంటున్నాను. నూతన బాధ్యతలు చేపట్టాక కూడా బిహార్‌తో నా బంధం ఇలాగే కొనసాగుతుందని హామీ ఇస్తున్నాను. కొత్త ప్రభుత్వానికి నా పూర్తి మద్దతు అందిస్తాను' అని ఎక్స్‌లో రాసుకొచ్చారు నితీశ్ కుమార్.నితీశ్ తాజా ప్రకటనతో.. బిహార్‌కు నూతన ముఖ్యమంత్రి ఎన్నిక అనివార్యం కానుంది. ఈ నేపథ్యంలో బీజేపీ నేతకే సీఎం పదవీ బాధ్యతలు దక్కవచ్చని విశ్వసనీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో పలువురు బీజేపీ ఆశావహులు




సీఎం కుర్చీ కోసం పోటీపడుతున్నారు. ఆ జాబితాలో ఉప ముఖ్యమంత్రులు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా, రాష్ట్ర మంత్రి దిలీప్ జాయస్‌వాల్, దిఘా ఎమ్మెల్యే సంజీవ్ చౌరాసియా వంటి వారి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ కూడా సీఎం రేసులో ఉన్నట్లు తెలుస్తోంది.బిహార్‌లో గతేడాది నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా.. బీజేపీ, జేడీయూ కూటమి తరఫున నితీశ్ కుమార్ రికార్డ్ స్థాయిలో పదోసారి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించారు. అయితే.. దేశ వ్యాప్తంగా 37 రాజ్యసభ స్థానాలకు మార్చి 16న ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రాజ్యసభకు వెళ్లేందుకు ఈ రోజే ఆయన నామినేషన్

# ఇజ్రాయెల్‌తో యుద్ధం.. ఇరాన్‌కు సాయం చేస్తున్న చైనా, రష్యా?

**మన దునియా,ఇంటర్‌నెట్ డెస్క్: మార్చి 05.**

ఇరాన్,ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధం ఆరవ రోజుకు చేరుకుంది. ఇజ్రాయెల్‌తో పాటు అమెరికా కూడా ఇరాన్‌పై దాడులు చేస్తోంది. ఇరాన్ మాత్రం ఒంటరిగానే పోరాడుతోంది. అయితే, మొన్నటి వరకు సాధారణ వార్ డ్రోన్స్, మిస్సైల్స్ వాడిన ఇరాన్ ఇప్పుడు డోస్ పెంచింది. ఏకంగా బాలిస్టిక్ మిస్సైల్స్ క్యారీయింగ్ క్లస్టర్ మూనిషన్స్‌ను రంగంలోకి దించింది. ఇజ్రాయెల్ భూభాగంపై అత్యంత అధునాతన, శక్తివంతమైన వీటిని ప్రయోగించింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ మిలటరీ అధికారులు స్వయంగా వెల్లడించారు.

**క్లస్టర్ వార్‌హెడ్ మిస్సైల్స్ ప్రత్యేకత ఏంటి?**

సాధారణ మిస్సైల్స్ టార్గెట్‌ను చేరుకుని పేలిపోతాయి. వీటి ప్రభావం కొంత వరకు మాత్రమే ఉంటుంది. కానీ, క్లస్టర్ వార్‌హెడ్ మిస్సైల్స్ అలా కాదు. క్లస్టర్ వార్‌హెడ్ మిస్సైల్స్ లోపల చిన్న చిన్న బాంబులు చాలా ఉంటాయి. ఆ మిస్సైల్ లక్ష్యాన్ని చేరిన తర్వాత మిస్సైల్ లోనుంచి చిన్న చిన్న బాంబులు బయటకు వస్తాయి. ఆ చిన్న బాంబులు మరింత ఎక్కువ ప్రదేశాన్ని కవర్ చేస్తాయి. పేలుడు తీవ్రత కొన్ని కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఒక రకంగా చెప్పాలంటే క్లస్టర్ వార్‌హెడ్ మిస్సైల్స్‌తో విధ్వంసం చాలా దారుణంగా ఉంటుంది.

ఇరాన్‌కు ఈ టెక్నాలజీ ఎక్కడిది?




ఇరాన్ ప్రయోగించిన క్లస్టర్ వార్‌హెడ్ మిస్సైల్స్ కారణంగా ఇజ్రాయెల్‌లో భయం మొదలైంది. ఇరాన్ ప్రయోగిస్తున్న క్లస్టర్ వార్‌హెడ్ మిస్సైల్స్ ఏకంగా 80 చిన్న బాంబులను రిలీజ్ చేస్తున్నాయని ఇజ్రాయెల్ రక్షణ శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. అత్యంత అధునాతనమైన ఈ క్లస్టర్ వార్‌హెడ్ మిస్సైల్స్ అమెరికా, రష్యా, చైనా, ఇండియా, ఇజ్రాయెల్, పాకిస్థాన్ దగ్గర మాత్రమే ఉన్నాయి. ఇజ్రాయెల్ మిలటరీ ఉన్నతాధికారులు చెబుతున్న దాని ప్రకారం.. క్లస్టర్ వార్‌హెడ్ మిస్సైల్స్‌ను తయారు చేసుకునే టెక్నాలజీ ఇరాన్ దగ్గర లేదు. చైనా లేదా రష్యాలు ఇరాన్‌కు సాయం చేసి ఉండొచ్చు..

# యూట్యూబర్ దారుణ హత్య.. ఇంట్లో కత్తి పోట్లతో..

**మన దునియా ఇంటర్నేషనల్ డెస్క్,కెనడా:మార్చి 05**

భారత సంతతికి చెందిన ఓ యూట్యూబర్ కెనడాలో దారుణ హత్యకు గురైంది. గుర్తు తెలియని వ్యక్తి ఆమెను ఇంట్లోనే అతి కిరాతకంగా కత్తితో పొడిచాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా యూట్యూబర్ ప్రాణాలు కోల్పోయింది. ఈ సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. లాసల్లే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పంజాబ్ మూలాలు కలిగిన నాన్సీ గ్రేవాల్ కెనడాలోని ఒంటారియోలో నివసిస్తోంది. నాన్సీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకుంది. పంజాబ్‌కు సంబంధించిన విషయాలపై ఎప్పటికప్పుడు తన అభిప్రాయాలను వీడియోల రూపంలో తెలియజేస్తూ ఉంటుంది. చాలా సందర్భాల్లో ఖలిస్థానీల తీరును తప్పుబట్టటంతో పాటు కెనడా, ఇండియాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల గురించి కూడా మాట్లాడింది. సోషల్ మీడియాలో ఎంతో యాక్టీవ్‌గా ఉండే నాన్సీపై మంగళవారం రాత్రి గుర్తు తెలియని ఓ వ్యక్తి కత్తితో దాడి చేశాడు. విచక్షణా రహితంగా పలుమార్లు ఆమెను పొడిచాడు. అనంతరం అక్కడినుంచి పారిపోయాడు. రాత్రి 9 గంటల ప్రాంతంలో ఈ దారుణం జరిగింది. స్థానికులు ఈ సంఘటనపై లాసల్లే పోలీసులు, పారామెడిక్స్‌కు సమాచారం ఇచ్చారు. విండ్సర్-ఎసెక్స్ ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ సిబ్బంది రక్తపు మడుగులో పడి ఉన్న నాన్సీని ఆస్పత్రికి తరలించారు. నాన్సీని పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోయినట్లు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. బుధవారం ఉదయం నాన్సీ ఉంటున్న ఏరియాలోని రెండు ఇళ్లలో సోదాలు నిర్వహించారు. కాంక్రీట్ రహదారితో పాటు నాన్సీ నివసిస్తున్న ఇంటిలోకి వెళ్లే మెట్లపై పలు ఆధారాలను సేకరించారు. ఈ కేసుకు సంబంధించి ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే డిటెక్టివ్ జామీ నెస్టర్‌కు ఫోన్ చేయాలని పోలీస్ ఉన్నతాధికారులు ప్రజలను కోరారు..




## దాతల సహకారంతో ఆర్థిక సహాయం

**తెలంగాణ అంబెడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు గుగ్గిళ్ల సురేష్, గాదె శ్రీనివాస్ చారి**

**మన మంగపేట:05(మన దునియా న్యూస్)**



ములుగు జిల్లా మంగపేట మండలం పొదుమూరు రెవిన్యూ గ్రామంలో తెలంగాణ అంబెడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ రోజు జింక్క రాములు మరణించారు. విరిది చాలా బీద కుటుంబం వారికీ ఉండడానికి సరైన ఇల్లు లేదు దశదిన ఖర్మలకు డబ్బులు లేక చాలా ఇబ్బందిగా ఉన్నాదని చెప్పగా దాతృత్వం కలిగిన దాతలు సహకరించమని అడగగా వెంటనే స్పందించి సహాయము చేయడం జరిగింది వారి సహకారంతో ఈరోజు జింక రాములు దశదిన కర్మలకు వారి భార్య సత్యమ్మ కుమారుడు చంద్రయ్యకు దాతలు ఇచ్చిన డబ్బులను అందచేయడం జరిగింది సహకరించిన దాతలకు వారి కుటుంబం కృతజ్ఞతలు చెప్పడం చెప్పారు ఇట్టి కార్యక్రమంలో గాదె శ్రీనివాస్ ఉద్యమకారుల సంఘం మంగపేట మండల అధ్యక్షులు, ఎర్రవుల రమేష్, ఎర్రవుల సమ్మయ్య పానేం గౌరయ్య ఎర్రవుల నర్సింహులు తదితరులు పాలుగోన్నారు

## రైతుబంధు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆర్ ఎస్ ములుగు జిల్లా నాయకులు భూక్య జంపన్న ఘాటు విమర్శలు

**మన దునియా న్యూస్: పిబ్రవరి:05**



ములుగు జిల్లా బీఆర్‌ఎస్ నాయకులు భూక్య జంపన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికలు సమీపించినప్పుడే కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుబంధు గుర్తుకు వస్తుందని ఆయన ఆరోపించారు. రైతుల సంక్షేమం గురించి పెద్ద ఎత్తున హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు.ప్రభుత్వం రైతుబంధు నిధుల విడుదల విషయంలో స్పష్టత లేకుండా పూటకో తేదీ ప్రకటిస్తూ రైతులను అయోమయంలోకి నెట్టేస్తోందని జంపన్న అన్నారు. రైతులు పండిస్తున్న పంట కాలం సగం పూర్తయిపోయినా ఇప్పటికీ రైతుబంధు అందని పరిస్థితి కొనసాగుతుందని పేర్కొన్నారు. దీనివల్ల విత్తనాలు, ఎరువులు, సాగు ఖర్చుల కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.రైతులు తమ భూముల్లో కష్టపడి పంటలు పండిస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి రావాల్సిన సహాయం అందక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. రైతులకు వెంటనే రైతుబంధు నిధులు విడుదల చేయకుండా ఆలస్యం చేయడం రైతుల పట్ల అన్యాయమని జంపన్న అభిప్రాయపడ్డారు.రైతుల సమస్యలను పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆయన విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేసి, పెండింగ్‌లో ఉన్న రైతుబంధు నిధులను విడుదల చేయాలని భూక్య జంపన్న డిమాండ్ చేశారు. రైతుల పట్ల ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించి వారి సమస్యలను పరిష్కరించాలని ఆయన సూచించారు.

## ఇరాన్‌పై అమెరికా దాడులు.. ఆ వ్యాఖ్యలను ఖండించిన భారత్

**మన దునియా,ఇంటర్నెట్ డెస్క్: మార్చి 05**

మధ్యప్రాచ్యంలో కొన్ని రోజులుగా భీకర యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై దాడుల కోసం అమెరికా నావికాదళం భారత నౌకలను ఉపయోగిస్తోందంటూ విస్తృతంగా జరుగుతున్న ప్రచారాలను కేంద్రం ఖండించింది. ఆ ఆరోపణలు పూర్తిగా అవాస్తవం, నిరాధారమని కేంద్ర విదేశాంగ శాఖస్పష్టం చేసింది.అమెరికా మాజీ ఆర్మీ కల్నల్ డగ్లస్ మాక్‌గ్రెగర్ ఇటీవల ఓ ఛానల్ ఇంటర్వ్యూ సందర్భంగా మాట్లాడుతూ.. 'గల్ఫ్ ప్రాంతంలో అమెరికా సైనిక స్థావరాలపై ఒత్తిడి పెరగడంతో మా నావల్ బేస్‌లు ధ్వంసమయ్యాయి. మా నౌకాశ్రయ సదుపాయాలూ ధ్వంసమయ్యాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో మేము భారత్, ఆ దేశానికి చెందిన నౌకాశ్రయాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఇది సరైన మార్గం కాదు. అయినప్పటికీ పరిస్థితుల ప్రభావం కారణంగా అలా చేయక తప్పడం లేదు' అని మాక్‌గ్రెగర్ అన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం కావడంతో ఈ వివాదం చెలరేగింది. దీనిపై స్పందించిన కేంద్ర విదేశాంగ శాఖ ఫ్యాక్ట్‌చెక్ విభాగం.. ఆ వ్యాఖ్యలను పూర్తిగా ఖండించింది. 'భారత పోర్టులు అమెరికా దాడులకు ఉపయోగిస్తున్నాయన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు' అని 'ఎక్స్' వేదికగా ప్రకటించింది. నిర్ధారణ లేని సమాచారం సోషల్ మీడియాలో పోస్ట్ చేయొద్దని హెచ్చరించింది...



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## దెబ్బకు దెబ్బ.. అమెరికా ట్యాంకర్‌ను పేల్చేసిన ఇరాన్.. 24 గంటల్లోనే బదులిచ్చామంటూ ప్రకటన

**మన దునియా ఇంటర్నేషనల్ డెస్క్:మార్చి 05**




ఇజ్రాయెల్–అమెరికా సంయుక్తంగా రంగంలోకి దిగిన ఇరాన్ ఎక్కడా తగ్గడం లేదు. మిడిల్ ఈస్ట్ లో యూఎస్ స్థావరాలు లేకుండా చేస్తామని హెచ్చరించిన ఇరాన్.. అన్నట్లుగానే గల్ఫ్ దేశాలలో ఉన్న స్థావరాలను టార్గెట్ చేస్తూ దాడులు చేస్తూనే ఉంది.యుద్ధం తీవ్రంగా మారిన క్రమంలో హిందూ మహాసముద్రంలోని భారత జలాల్లో ఇరాన్ షిప్ ను అమెరికా జలాంతర్గామితో పేల్చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 87 మంది ఇరాన్ సైనికులు చనిపోయారు. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామన్న ఇరాన్.. అన్నంత పనిచేసింది. అమెరికా ట్యాంకర్ ను పేల్చేసినట్లు ప్రకటించింది.ఉత్తర పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో అమెరికా ట్యాంకర్ ను పేల్చేసినట్లు గురువారం (మార్చి 05) ఇస్లామిక్ రివొల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ప్రకటించింది. యూఎస్ నౌక తగలబడుతోందని ఇరాన్ మీడియా వెల్లడించింది. ఈ ఘటనలో ఎంత మంది చనిపోయారనేది తెలియాల్సి ఉంది.యూఎస్ జలాంతర్గామి ఇరాన్ యుద్ధ నౌకను ముంచేసిన 24 గంటల్లోనే ఇరాన్ ప్రతీకారం తీర్చుకోవడం గమనార్హం. శ్రీలంక తీరానికి సమీపంలో జరిగిన ఈ దాడిలో అమెరికా నౌక మంటల్లో కాలిపోయింనీ.. ద దెబ్బకు దెబ్బ తీశామని ఐ ఆర్.ఐ.ఎస్ ప్రకటించింది.విశాఖపట్నంలో రెండు రోజుల నవికా విన్యాసాల లో పాల్గొనేందుకు ఫిబ్రవరిలో ఐ ఆర్.ఐ.ఎస్ దెనా అనే వార్ షిప్ ఇండియాకు వచ్చింది. తిరిగి ఇరాన్ వెళు _న్న క్రమంలో యూఎస్ టార్పెడో తో పేల్చేశారు అమెరికా సైనికులు. హఠాత్తుగా జరిగిన దాడిలో 87 మంది సైనికులు చనిపోయారు. 60 మంది తప్పిపోయారు. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామన్న ఇరాన్.. అదే తీవ్రతతో అమెరికాకు చెందిన నౌకను పేల్చేయడం గమనార్హం. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## వంట గ్యాస్ గండం, సిలిండర్ల బుకింగ్..సరఫరా పై తాజా ఆంక్షలు..!!




**మన దునియా,హైదరాబాద్: మార్చి 05**

వంటగ్యాస్ వినియోగదారులకు బిగ్ అలర్ట్. వంట గ్యాస్ సరఫరాకు గండం పొంచి ఉంది. పశ్చిమా సియాలో నెలకొన్ని ఉద్రిక్తతల ప్రభావం చమురు సరఫరా పై పడింది. దీంతో.. నాలుగు రోజులుగా వంట గ్యాస్ సిలిండర్ల కోసం బుకింగ్ ఒత్తిడి పెరుగుతోంది. దీంతో.. అనధికారికంగా ఆంక్షలను ఆయిల్ కంపెనీలు అమలు చేస్తున్నాయి. ఫలితంగా వినియోగదారుల్లో మరింత ఆందోళన పెరుగుతోంది. బుకింగ్ కోసం తాజాగా నిర్దేశించిన గడువు పూర్తియిన తరువాతనే రిజిస్టర్ చేసుకోవటం ఈ ఆందోళనకు కారణంగా నిలుస్తోంది.పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు భారతీయ వంటింట్లో మంట పుట్టిస్తున్నాయి. ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో వంటగ్యాస్ (ఎల్‌పిజి) సరఫరాకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ముడి చమురు నిల్వలు దాదాపు 8 వారాల వరకు ఉన్నప్పటికీ, సరఫరా పూర్తిగా నిలిచిపోతే ఇంధన రేషనింగ్ చేయాల్సిన గడ్డు పరిస్థితి తప్పదనే అంచనాలు మొదలు అయ్యాయి. ఫలితంగా డొమెస్టిక్ వంట గ్యాస్ వినియోగదారులు ముందుగానే గ్యాస్ రీఫిల్స్ కోసం పెద్ద ఎత్తున బుక్ చేసుకుంటున్నారు. గత నాలుగు రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో వంట గ్యాస్ బుకింగ్ కోసం వినియోగదారులు పెద్ద సంఖ్యలో బుక్ చేసుకుంటున్నారు. ఒత్తిడి పెరుగుతున్న వేళ ప్రధాన అయిల్ కంపెనీల డీలర్లు అనధికారికంగా సిలిండర్ బుకింగ్ పైన ఆంక్షలను అమలు చేస్తున్నారు. ఇందు కోసం డబుల్ సిలిండర్ ఉన్న వారికి 30 రోజులు.. సింగిల్ సిలిండర్ ఉన్న వారికి 21 రోజులు గడువుగా నిర్దేశించారు.సిలిండర్ల బుకింగ్ పై ఆంక్షలు చివరి సిలిండర్ అందుకున్న రోజు నుంచి 21 రోజుల తరువాత అయితేనే గ్యాస్ సిలిండర్ తిరిగి బుక్ చేసుకుంటామని చెబుతున్నారు. ఆయిల్ కంపెనీల నుంచి అధికారికంగా ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు రాకపోయినా... వినియోగదారుల నుంచి పెరుగుతున్న బుకింగ్ ఒత్తిడిని తగ్గించేందుకు ఈ ఆంక్షలను అమలు చేస్తున్నారు. యుద్ద ప్రభావంతో రానున్న రోజుల్లో వంట గ్యాస్ కు కొరత ఏర్పడుతుందనే చర్చ పెద్ద ఎత్తున జరుగుతోంది. దీంతో.. గతం కంటే భిన్నంగా ఒకే సారి రెట్టింపు సంఖ్యలో వంట గ్యాస్ సిలిండర్ల కోసం బుకింగ్ లు జరుగుతున్నాయి. నిర్దేశిత గడువు మేరకే బుకింగ్స్ జరిగే విధంగా ఆయిల్ కంపెనీలు వినియోగదారులు ఉపయోగించే పోర్టల్స్, యాప్ ల సాఫ్ట్ వేర్ లో మార్పులు చేసారు. దీంతో.. ఈ యుద్దం మరింత కాలం కొనసాగితే వంట గ్యాస్ తో పాటుగా పెట్రోల్, డీజిల్ సరఫరాలోనూ సమస్యలు వస్తాయనే చర్చ సాగుతోంది.

# పశ్చిమాసియా ఉద్రిక్తతల మధ్య అమెరికా భారీ క్షిపణి పరీక్ష

**మన దునియా,అమెరికా ఇంటర్నేషనల్ డెస్క్:మార్చి 05**

పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నడుమ అమెరికా భారీ అణు సామర్థ్యం గల క్షిపణి పరీక్ష నిర్వహించడం ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. అమెరికా సైన్యం కాలిఫోర్నియా తీరంలో ఉన్న వాండెన్‌బర్గ్ స్పేస్ ఫోర్స్ బేస్ నుంచి శక్తిమంతమైన మినిట్‌మ్యాన్–3 ను విజయవంతంగా ప్రయోగించింది. ఈ పరీక్షను అమెరికా సాధారణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిందని అధికారులు వెల్లడించారు.

కాలిఫోర్నియా తీరంలో క్షిపణి ప్రయోగం..

ఈ క్షిపణి పరీక్ష సాంటా బార్బరా సమీపంలోని వాండెన్‌బర్గ్ స్పేస్ ఫోర్స్ బేస్ నుంచి నిర్వహించారు. జిటి–254 పేరుతో నిర్వహించిన ఈ ప్రయోగంలో నిరాయుధ రాకెట్‌ను ఉపయోగించినట్లు అమెరికా అధికారులు తెలిపారు. ప్రయోగించిన క్షిపణి పసిఫిక్ మహాసముద్రంలో ఉన్న మార్షల్ ఐస్ ల్యాండ్ సమీపంలోని లక్ష్యాన్ని కచ్చితంగా తాకినట్లు అమెరికా స్పేస్ ఫోర్స్ వెల్లడించింది.

అణు వార్‌హెడ్‌లను మోయగల సామర్థ్యం..

మినిట్‌మ్యాన్–3 క్షిపణి అమెరికా రక్షణ వ్యవస్థలో కీలక భాగమని అధికారులు తెలిపారు. ఈ క్షిపణి అణు వార్‌హెడ్‌లను మోసుకెళ్లగల సామర్థ్యం కలిగి ఉంటుంది. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో హిరోషిమాపై పడేసిన అణుబాంబుల కంటే 20 రెట్లు శక్తివంతమైన వార్‌హెడ్‌లను మోయగల క్షిపణి అని అధికారులు చెబుతున్నారు.

పరీక్ష లక్ష్యం ఏమిటి..?

అమెరికా ఎయిర్‌ఫోర్స్ ప్రకారం.. ఈ పరీక్ష పూర్తిగా రక్షణాత్మక ప్రయోజనాల కోసం నిర్వహించిందని అధికారులు తెలిపారు. క్షిపణి వ్యవస్థ




కచ్చితత్వం, ప్రభావం, సిద్ధంగా ఉండే చర్యలను పరీక్షించడం ప్రధాన లక్ష్యమని అధికారులు వివరించారు. అలాగే వివిధ మిషన్ ప్రొఫైల్స్ ద్వారా మినిట్‌మ్యాన్–3 వ్యవస్థ పనితీరును మెరుగుపరచడానికి ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అణు రక్షణ వ్యవస్థ సిద్ధత..

అమెరికా భూమి ఆధారిత అణు దాడి వ్యవస్థ సిద్ధతను నిర్ధారించుకోవడమే ఈ పరీక్ష ముఖ్య ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. అంతర్జాతీయ భద్రతా పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో రక్షణ వ్యవస్థలు ఎప్పుడూ సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఉద్రిక్తతల నేపథ్యంలో చర్చ..

ఇటీవల అమెరికా, ఇజ్రాయెల్‌లు కలిసి ఇరాన్‌పై దాడులు చేసిన నేపథ్యంలో ఈ క్షిపణి పరీక్ష జరగడం ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీసింది. అయితే ఈ పరీక్షకు ఆ ఘటనలతో ప్రత్యక్ష సంబంధం లేదని అమెరికా స్పష్టం చేసింది..

## ఖమేనీ చనిపోయినా ఇరాన్ వెనక్కి తగ్గకపోవడానికి కారణం IRGC.. ఇది సైన్యం కాదు అంతకు మించి..

**మన దునియా ఇంటర్నేషనల్ డెస్క్:మార్చి 05**

ప్రపంచంలో ఏ దేశానికైనా సైన్యం ఒకటే ఉంటుంది.. కానీ ఇరాన్ లో మాత్రమే సైన్యానికి, ప్రభుత్వానికి సమాంతరంగా కొనసాగే వ్యవస్థ ఉంది. అదే, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ ఇరాన్ రాజకీయ, సైనిక మరియు ఆర్థిక ముఖచిత్రంలో ఐఆర్ జీసీది అత్యంత కీలకమైన పాత్ర. వాస్తవానికి దేశ సైన్యం కంటే, ప్రభుత్వానికంటే ఈ రివల్యూషనరీ గార్డ్స్ కే అధికారాలు ఎక్కువ. ఈ విప్లవ సైన్యం కేవలం ఇరాన్ సుప్రీం లీడర్ కు మాత్రమే జవాబుదారీగా ఉంటుంది. ప్రభుత్వానికి కానీ, ప్రధాని, అధ్యక్షుడు.. తదితర వ్యవస్థలకు ఇది ఎలాంటి బాధ్యత వహించదు. దేశ సరిహద్దులను కాపాడటంతో పాటూ ఇస్లామిక్ విప్లవ ఆశయాలను రక్షించడం ఐఆర్ జీసీ ప్రధాన ఉద్దేశ్యం.ఇరాన్‌లో 1979 లో జరిగిన ఇస్లామిక్ విప్లవం తర్వాత, అప్పటి సుప్రీం లీడర్ "ఆయతొల్లా రుహొల్లా ఖొమేనీ" ఈ దళాన్ని స్థాపించారు. అప్పట్లో సాధారణ సైన్యం పాత రాజు (షా) పట్ల విధేయత చూపుతుందనే భయంతో, కేవలం ఇస్లామిక్ వ్యవస్థకు మరియు సుప్రీం లీడర్‌కు మాత్రమే జవాబుదారీగా ఉండేలా ఈ ప్రత్యేక దళాన్ని రూపొందించారు. కాలక్రమేణా ఇది దేశంలోని అన్ని విభాగాలపై పట్టు సాధించి, ఒక శక్తిమంతమైన సామ్రాజ్యంగా ఎదిగింది.ఐఆర్‌యజీసీకి స్వంతంగా ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ విభాగాలు ఉన్నాయి. దీనిలోని రెండు ప్రధాన విభాగాలు కాగా, ఒకటి.. ఖుద్స్ ఫోర్స్ (ఐఆర్ జీసీ యొక్క విదేశీ విభాగం), రెండోది బాసిజ్ మిలీషియా (అంతర్గత విభాగం). ఇరాన్ వెలుపల లెబనాన్, సిరియా, ఇరాక్, యెమెన్ వంటి దేశాల్లో సైనిక మరియు వ్యూహాత్మక కార్యకలాపాలను ఖుద్స్ ఫోర్స్ నిర్వహిస్తుంది. హిజ్బుల్లా, హమాస్ వంటి సంస్థలకు మద్దతు ఇవ్వడంలో ఇది కీలకం. దేశంలో తలెత్తే నిరసనలను అణిచివేసేందుకు, విప్లవ వ్యతిరేక కార్యకలాపాలను అడ్డుకోవడానికి బాసిజ్ మిలీషియాను ఉపయోగిస్తారు.ఐఆర్‌యజీసీ యొక్క అతిపెద్ద బలం దాని అధికారక్రమం. ఇది ఇరాన్ ప్రభుత్వానికి లేదా అధ్యక్షుడికి జవాబుదారీ కాదు. ఇది నేరుగా దేశ అత్యున్నత నాయకుడైన "సుప్రీం లీడర్" ఆదేశాల మేరకు పనిచేస్తుంది. దీనివల్ల దేశ విదేశాంగ




విధానంలో మరియు అంతర్గత రాజకీయాల్లో ఐఆర్శ్రీజీసీ మాటకే మొగ్గు ఉంటుంది. వాస్తవానికి, ఇరాన్ యొక్క అణు కార్యక్రమం మరియు క్షిపణి వ్యవస్థల నియంత్రణ కూడా వీరి చేతుల్లోనే ఉంటుంది. ఐఆర్జీసీ కేవలం ఆయుధాలతోనే కాకుండా, ఆర్థిక బలంతోనూ దేశాన్ని శాసిస్తోంది. ఇరాన్‌పై అంతర్జాతీయ ఆంక్షలు ఉన్నప్పటికీ, దేశంలోని చమురు, గ్యాస్, నిర్మాణం, టెలికమ్యూనికేషన్స్ మరియు బ్యాంకింగ్ రంగాల్లోని ప్రధాన కంపెనీలు ఐఆర్ఎజీసీ నియంత్రణలో ఉన్నాయి.వేల కోట్ల డాలర్ల టర్నోవర్ కలిగిన ఈ వ్యాపార సామ్రాజ్యం ద్వారా వచ్చే ఆదాయాన్ని వారు తమ సైనిక కార్యకలాపాలకు మరియు విదేశీ మద్దతుదారులకు ఉపయోగిస్తారు. ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో మారుతున్న రాజకీయ సమీకరణాల వల్ల ఐఆర్జీసీ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ముఖ్యంగా ఇజ్రాయెల్, అమెరికాతో పెరుగుతున్న ఉద్రిక్తతలు మరియు అంతర్గతంగా ప్రజల్లో వస్తున్న మార్పులు ఈ దళానికి సవాలుగా మారాయి. ఇటీవల జరిగిన దాడుల్లో కీలక కమాండర్లను కోల్పోయినప్పటికీ, ఇరాన్ మనుగడకు మరియు ఆ ప్రాంతంలో ఇరాన్ ప్రాబల్యానికి ఐఆర్జీసీ ఇప్పటికీ వెన్నెముకగా నిలుస్తుండటం గమనార్హం.

## భర్త మృతిని తట్టుకోలేక భార్య మృతి 4 గంటల వ్యవధిలోనే దంపతుల కన్నుమూత

**మన దునియా,జగిత్యాల జిల్లా: మార్చి 05**

జగిత్యాల జిల్లాలో హృదయాన్ని కలిచివేసే విషాద ఘటన చోటుచేసుకుంది. పెగడపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సురకంటి సత్తిరెడ్డి ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది.మద్దులపల్లి గ్రామానికి చెందిన ఆయన తల్లిదండ్రులు చుక్కరెడ్డి, శంకరవ్వ కేవలం 4 గంటల వ్యవధిలోనే కన్నుమూశారు.సమాచారం ప్రకారండ చుక్కరెడ్డి అనారోగ్యంతో బుధవారం సాయంత్రం సుమారు 6 గంటల ప్రాంతంలో మృతి చెందారు. ఈ విషాదాన్ని తట్టుకోలేక ఆయన భార్య శంకరవ్వ తీవ్ర మనస్తాపానికి గురయ్యారు.భర్త మృతితో తీవ్రంగా కలత చెందిన ఆమె అదే రోజు రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో కన్నుమూశారు.నాలుగు గంటల వ్యవధిలోనే దంపతులు ఇద్దరూ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు. కుమారుడు సత్తిరెడ్డి నాలుగు రోజుల క్రితమే వ్యవసాయ విజ్ఞాన యాత్రకు వెళ్లినట్లు తెలుస్తోంది.ఈ ఘటనతో మద్దులపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



మన దునియా
RNI Number
మన అక్షరం - మన ప్రపంచం



# దైవ పూజలు, శాంతులు, హోమాలు గృహప్రవేశ సందర్భంలో ఎందుకు చేస్తున్నాము !!

మానవుడు అనంతకోటి జీవరాశులలో ఒకడు. ప్రకృతితో మమేకమై జీవనం సాగించినప్పుడే అతడి మనుగడకు సార్థకత. అన్నింట్లో తాను కూడా ఒకడై మిగతా జీవులతో సమానంగా జీవించాలని శాస్త్రం బోధిస్తుంది. పక్షిజాతి ఎలా గూడు కట్టుకుని జీవిస్తుందో, మానవుడు కూడా తన రక్షణకు తనవారి పరిరక్షణ కోసం ఒక ఇల్లు కట్టుకుని బ్రతుకుతాడు. ఇక ఒక ఇల్లు కట్టాలంటే శాస్త్రం ఎన్ని విధినిషేధాలు చెప్పింది. స్థల సేకరణ దగ్గరనుండి ఇల్లు పూర్తిగా కట్టుకునే వరకు ఎలా వ్యవహరించాలో ప్రత్యేకంగా వాస్తు శాస్త్ర రూపంలో వివరిస్తుంది. వాస్తు శాస్త్రంలో ఎంతో విజ్ఞాన నిధి నిబిడీకృతమై వున్నది. ఏ వైపు ఎత్తుగా వుండాలి, ఏ వైపు కొంచెం వాలు ఉండాలి, ఏ గది ఎక్కడ కట్టుకోవాలో చెబుతుంది వాస్తుశాస్త్రం. మనకున్న ఈశాన్య, నైరుతి ఋతుపవనాల ఆధారంగా ఎక్కడ వంటిల్లు వుండాలి,

ఎక్కడ బావులు తవ్వాలి, యెక్కడ పడకిల్లు ఉండాలో దాని వలన వారికి ఎలా ఆరోగ్యం కలుగుతుందో అన్న విషయాన్ని

శాస్త్రం చెబుతుంది. శాస్త్ర ప్రధాన ఉద్దేశ్యం ఇంటికి, వంటికి సరైన వెలుతురు, గాలి ప్రసరణ జరగాలి,

తద్వారా శారీరక, మానసిక ఉల్లాసం, ఆరోగ్యం కలగాలని ఆ శాస్త్ర ప్రధాన ఉద్దేశ్యం.

దాన్ని నేడు వక్రీకరించి కొంతమంది శాస్త్ర ప్రాముఖ్యాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నారు,

అది వేరే విషయం.

ఒక ప్రదేశాన్ని గృహ నిర్మాణానికి ఎంచుకున్న తరువాత ముందుగా పూజ చేసి పనులు ప్రారంభిస్తాము. చదునుచేసుకున్న ప్రదేశంలో శంఖుస్థాపన చేసుకుని అప్పుడు నిర్మాణం చేపడతాము.

మనం ఎంచుకున్న ప్రదేశంలో అంతకు ముందు కొన్ని చెట్లు ఉండవచ్చును,వాటిపై నివాసముండే ఎన్ని జీవరాశులు వాటి నెలవు కోల్పోతాయి.

ఆ నేలను నమ్ముకుని ఎన్నో జీవాలు ఉంటాయి. మనం చదును చెయ్యడం వలన ఎన్నో జీవరాశులను మనం తెలియక చంపుతున్నాము.

ఇదంతా మనకు తెలియక చేస్తున్న పాపం. కానీ మనం ఒక గృహం కట్టుకోవాలంటే తప్పదు.

ఇంతేకాదు రోజు మనం ఇల్లు తుడవడం వలన ఎంతో హింస చేస్తున్నాం. దీనికి శాస్త్రం భూత హింస అని అంటుంది.

అటువంటి భూతహింస తెలిసో తెలియకో మనం రోజూ చేస్తున్నాము. వాటి ప్రక్షాళనకు మనకు దానం, హోమం ఇతరత్రా చెప్పబడి వున్నాయి.

గృహస్థు మిగిలిన ఆశ్రమాల వారిని పోషించాలి. చదువుకునే బ్రహ్మచారులకు, ఆకలితో వచ్చిన అతిధులను, ముసలి వారిని, సన్న్యాసాశ్రమ వాసులను పోషించవలసిన బాధ్యత గృహస్తాశ్రమానికి ఉన్నది. అటువంటి గృహస్తు ఒక ఇంటిని కట్టుకున్నప్పుడు చెయ్యవలసిన శాంతులు, హోమాలు దైవజ్నులైన పండితులు చెబుతారు.

వాటిని ఆచరించడం వలన మనం చేసిన హింస ప్రక్షాళన జరుగుతుంది.

గృహం నిర్మించడానికి మొదలు ఇంటికి ఈశాన్యంలో ఒక శుభ



ముహూర్తంలో శుద్ధి చేసి ఎక్కడ నుండి పని ప్రారంభిస్తామో అక్కడ నేలలో కొన్ని అడుగుల గొయ్యిలో నవధాన్యాలు, నవరత్నాలు, శంఖువు స్థాపించి, తాపీ పని అక్కడ మొదలు పెడతాము. ఇంటికి అది ఆయువుపట్టు. ఒకరకంగా చెప్పాలంటే అది ఎనర్జీ సెంటర్. అక్కడ నమక చమకాలతో మంత్రసహితంగా

ఎన్నో ఉపచర్యలు చేసి శక్తిని నిలుపుతాము. అక్కడనుండి మిగిలిన పనులు చేసుకుంటూ ఇంటికి గాలి వెలుతురు వచ్చేట్టుగా జాగ్రత్తగా కట్టుకుంటున్నాము.

ఆ గృహానికి సీమగా ఆ గృహ ప్రధాన ద్వారాన్ని మంచి ముహూర్తంలో నిలుపుతాము. గృహ ప్రవేశ సమయంలో మనం చేసిన పని సక్రమంగా జరిపించి సజావుగా పూర్తి చేయించినందుకు దేవతలకు ధన్యవాద పూర్వకంగా హోమ, జప తపాదులు చేసి అందరికీ అన్నశాంతి జరిపించి వారి ఆశీర్వాదాలను అందుకుని ఆ ఇంట అడుగు పెడతాము.

ఆ ఇంటిలో అన్నీ శుభకార్యాలు జరగాలని భగవంతుని ప్రార్థిస్తాము. అవష్ఘ్అజవ ఎనర్జీ ని బయటకు తరిమి జూశింఠ్అజవ ఎనర్జీ ని ఇంటిలో నిమ్పుకుంటాము.

సకల దేవతా స్వరూపంగా కామధేనువు ఇంటి లో నడయాడెట్టు ఒక ఆవును ఇంటిలో ప్రవేశం చేయిస్తాం. ఇంట్లో సుఖ సంతోషాలు పొంగి పొరలాలని పాలు పొంగించి పొంగలి చేసి దేవునికి నివేదన చేస్తాం. మన ధర్మం ప్రకృతిలో అన్నింటిలోను దైవాన్ని దర్శిస్తాము. పొద్దున్న లేచి కాలు కింద పెట్టాలంటే భూమాతకు "సముద్ర వసనే దేవి పర్వత స్తన మండలే .. "

అంటూ మన పాదం ఆవిడ మీద మోపినందుకు క్షమాపణ చెప్పుకుని ఆవిడ మనల్ని రక్షించాలని కోరుకుని రోజు మొదలు పెడతాము. మనకు నీరు దైవం, గాలి దైవం, అగ్ని దైవం, అన్నీ దేవతా స్వరూపాలే. మన చుట్టూ మనతో వున్న అధిదేవతలు మనలను నిత్యం కాపాడాలని వారిని ప్రార్ధించుకుంటాము. వారి ప్రీతిగా హోమాలు చేసి వారి స్వాహా కారంతో వారిని తృప్తి పరచి మన జీవనం సాగించడం మనకు శాస్త్రం నేర్పుతుంది. అంతేకానీ టోస్ట్ అని వైన్ తాగే, తాగించే సంస్కృతి కాదు మనది.

## వరుసకు చెల్లెలైన బాలికను ప్రేమ పేరుతో నమ్మించి, శారీరకంగా లొంగదీసుకున్న యువకుడు

**మన దునియా,జగిత్యాల జిల్లా ధర్మపురి:మార్చి 05**



సూసైడ్ నోటు రాసి పురుగుల మందు తాగిన బాలిక.. మూడు నెలలుగా చికిత్స పొందుతూ మృ..తిజగిత్యాల జిల్లా ధర్మపురి మండలం నర్సయ్యపల్లిలో అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ ఇంటర్ చదువుతున్న బాలిక అదే గ్రామంలో జులాయిగా తిరుగుతూ, వరుసకు చెల్లెలైన ఈ బాలికను ప్రేమ పేరుతో నమ్మించి, శారీరకంగా లొంగదీసుకున్న కోల మనోజ్ అనే యువకుడు ఈ విషయం ఎవరికైనా చెప్తే బాలికను, ఆమె సోదరుడిని చంపేస్తానని బెదిరించిన మనోజ్ పెళ్లి చేసుకుందామని ఆమె కోరగా.. మనోజ్ "చ...స్తే చా..వు" అని నిరాకరించడంతో, డిసెంబర్ 8న పురుగుల మందు తా..గిన బాలిక బంధువులు ముందుగా జగిత్యాల ఆసుపత్రిలో, అక్కడి నుండి హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా.. మూడు నెలలుగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృ..తి చెందిన బాలిక బాలిక తల్లి ఫిర్యాదుతో మనోజ్‌పై పోక్సో, రేప్ కేసులు నమోదు చేసిన పోలీసులు

# సోను సూద్ స్ఫూర్తి .. ఆ పేరుతోనే సేవా కీర్తి..

**పాలమూరులో మరో యువ సోనూసూద్..**

**"సోను సూద్ శివ"గా యువకుడు సేవలు..**

**టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి సహకారంతో సోనుసూద్ ను కలుసుకున్న శివ..**

**వివిధ సేవా కార్యక్రమాలతో ముందు అడుగు..**

**మన దునియా,పాలమూరు: మార్చి 05**

సోనుసూద్... కోవిడ్ కు ముందు ఈ పేరు కేవలం సినీ ప్రేమికులకు మాత్రమే తెలుసు.. కానీ కోవిడ్ తర్వాత ఈ పేరు తెలియని వారు అంటూ ఎవరూ లేరు.. దానికి కారణం ప్రాణాంతకమైన కోవిడ్ తో ప్రపంచం అల్లకల్లోలం అవుతున్నప్పుడు సినిమాల్లో విలన్ వేషాలు వేసే ఈ నటుడు నిజజీవితంలో మాత్రం హీరో అయ్యాడు.. తన సేవా కార్యక్రమాలతో ఎందరికో ఆదర్శం అయ్యాడు.. ఆయన స్ఫూర్తితోనే పాలమూరు జిల్లా కేంద్రంలో ఒక యువ సోనూ సూద్ అవతరించాడు.. ఆయన పేరును తన పేరుకు జోడించి వివిధ సేవా కార్యక్రమాలతో వేగంగా ముందడుగు వేస్తున్నాడు.. అతని పేరు నిన్నటి దాకా శివ.. ప్రస్తుతం అతడు శివ సూద్.. ఈ శివ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలంటే..

ఇలా సేవల వైపు..

సినీ నటుడు సోను సూద్ పూర్తిగా సేవల వైపు సాగాలనుకున్న శివ సోనూసూద్ శివగా మారి సేవా కార్యక్రమాలు మొదలుపెట్టాడు. సోనుసూద్ ఫౌండేషన్ పేరిట సేవా సంస్థ ఏర్పాటు చేసి రక్తం దొరకకుండా ఏ ఒక్కరు చనిపోకూడదని లక్ష్యంతో రక్తదానం చేసేలా ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తూ యువతీ, యువకులతో రక్త దానాలు చేయించి ఎన్నో ప్రాణాలను కాపాడాడు. అదేవిధంగా రోడ్ల పైన మతిస్థిమితం లేని వ్యక్తులను ఎంతోమందిని చేర తీసి వాళ్లను పరిశుభ్రంగా మార్చి కొత్త బట్టలతో శుభ్రంగా తయారు చేశాడు. పలు అన్నదాన కార్యక్రమాలు, ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు పండ్ల పంపిణీ వంటివి చేపట్టాడు. ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు చేపడుతూ ప్రజలందరికీ చేరువవుతూ సేవకుడిగా ఇంటింతై ఎదుగుతున్నాడు. సేవల ద్వారా అందరి ప్రశంసలను అందుకుంటున్నారు..

మిథున్ సాయం.. సోనూ దర్శనం..

వివిధ కార్యక్రమాలతో ముందడుగు వేస్తున్న ఈ యువకుడిది ఒకే ఒక కోరిక.. ఏనాటికైనా సోను సూద్ ను కలవాలనేది అతని ఆకాంక్ష. ఈ కోరికను టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఏపీ మిథున్ రెడ్డికి తెలియజేయడంతో ఆయన చొరవచేసి ఇతడిని, ఇతనితో పాటు సేవలు చేస్తున్న మిగతా యువకులను సోను సూద్ తో కలిపారు. వారికి శుభాకాంక్షలు తెలియజేసిన సోనుసూద్ మీలాంటి సేవకులకు ఎల్లప్పుడూ తన సహాయ సహకారాలు ఉంటాయని తెలియజేయడం విశేషం. సోను సూద్ శివ తో పాటు సంస్థ ఉపాధ్యక్షుడు సి. మనోహర్, ప్రధాన కార్యదర్శి గుమ్మడాల కిషోర్ గౌడ్, జాయింట్ సెక్రెటరీ అబ్దుల్ ముబారక్ తదితరులు సోనసూద్ ను కలిసిన వారిలో ఉన్నారు..



# పున్నమి వెలుగుల్లో వనదేవత పరవశం..

**ఖడ్గ రూపంలో దర్శనమిచ్చే ఆదివాసుల ఆరాధ్య దైవం**

**వర్షాగమనాన్ని సూచించే వెండి కంకణాల సవ్వడి**

**సంతాన ప్రాప్తిని ప్రసాదించే కల్పవల్లిగా ప్రతీతి**

**ఎంచగూడెంలో కొలువైన 'కొమ్మాలమ్మ'!**

**మన దునియా,మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ,ఎంచగూడ: మార్చి 05**

నిండు పున్నమి కాంతుల్లో అడవి తల్లి పులకిస్తోంది. డోలు వాయిద్యాల మోత, శివసత్తుల పూనకాల మధ్య మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఎంచగూడ గ్రామంలో వెలిసిన 'కొమ్మాలమ్మ' జాతర భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. మేడారం సమ్మక్క-సారలమ్మల తరహాలోనే గిరిజనులు అత్యంత భక్తిశ్రద్ధలతో కొలిచే ఈ వనదేవతకు 11వ శతాబ్దం నాటి ఘనమైన చరిత్ర ఉంది.

విగ్రహం కాదు.. ఖడ్గమే దైవం!

సాధారణంగా దైవం అంటే విగ్రహ రూపంలో ఉంటారు. కానీ, కొమ్మాలమ్మ తల్లి ఇక్కడ ఖడ్గ (కత్తి) రూపంలో దర్శనమివ్వడం ఒక విశిష్టమైన సంప్రదాయం. ఆదివాసీ దేవతలందరిలో కెల్లా పెద్ద దేవతగా కొమ్మాలమ్మను కొలుస్తారు. ఒకప్పుడు గోదావరి తీరంలో వెలిసిన ఈ తల్లి, కాలక్రమేణా 'వాసం' వంశీయుల ఆరాధ్య దైవంగా ఎంచగూడ ప్రాంతానికి చేరుకుంది. ఈ దైవానికి యాలం, ఆలూరి వంశీయులు ప్రధాన వడ్డెలుగా (పూజారులుగా) వ్యవహరిస్తారు. పూర్వం ఈ ఖడ్గాన్ని తిరిగి గోదావరి ప్రాంతానికి తరలించే ప్రయత్నం చేయగా, అరిష్టాలు సంభవించడంతో భక్తులు భయపడి తిరిగి ఎంచగూడలోనే ప్రతిష్ఠించారని స్థానిక చరిత్ర చెబుతోంది.

భవిష్యత్తును చెప్పే ప్రకృతి శాస్త్రవేత్త

కొమ్మాలమ్మ కేవలం దేవత మాత్రమే కాదు, ఆదివాసీల పాలిట ఒక ప్రకృతి శాస్త్రవేత్తగా విరాజిల్లుతోంది. రాబోయే ఏడాది వర్షాలు ఎలా ఉంటాయో తల్లి ముందే హెచ్చరిస్తుందని భక్తుల నమ్మకం. గద్దెపై ఉన్న ఖడ్గానికి తగిలించిన వెండి కంకణాలు కదిలి గలగలమంటూ శబ్దం చేస్తే ఆ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని, ఒకవేళ కంకణాలు బిగుసుకుపోయి నిశ్శబ్దంగా ఉంటే వర్షాలు తక్కువని గిరిజనులు భావిస్తారు. వర్షాలు లేని సమయంలో ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు చేస్తే కచ్చితంగా వానలు కురుస్తాయని వారి ప్రగాఢ విశ్వాసం.

వెండి కంకణాలే కానుకలు

సమ్మక్క సారలమ్మలకు బెల్లాన్ని (బంగారాన్ని) సమర్పించినట్లుగా, కొమ్మాలమ్మ తల్లికి వెండి కంకణాన్ని కానుకగా సమర్పించడం ఇక్కడి ప్రధాన ఆచారం. ముఖ్యంగా సంతానం లేని వారు తల్లిని వేడుకుంటే ఫలితం నిశ్చయమని భక్తుల నమ్మకం. కోరిక తీరిన దంపతులు తమ కృతజ్ఞతగా తల్లికి వెండి కంకణాలను (రింగులను) సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు.

అడవి బిడ్డల సంస్కృతికి నిలువుటద్దం

ప్రతి రెండేళ్లకు ఒకసారి కోనాపురం అడవుల నుండి సేకరించిన ప్రత్యేక వెదురు కంకలు, ఎర్రని జెండాలు ఈ జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. సమ్మక్క బండారి వంశానికి చెందిన వారు కాగా, కొమ్మాలమ్మ కూడా అదే బండారి వంశీయుల మహాశక్తిగా పూజలందుకోవడం విశేషం. అగ్ని రూపంలో గద్దెపైకి చేరే వనదేవత, అడవి బిడ్డల కష్టాలను తీర్చే కల్పవల్లిగా వెలుగొందుతోంది.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## అప్పు అడిగినందుకే ప్రాణం తీసిన దారుణం

**మన దునియా,చిత్తూరు, తుమ్మిందపాళ్యం:మార్చి 05**



చిత్తూరు మండలం తుమ్మిందపాళ్యం గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. స్నేహితుడికి ఇచ్చిన రూ.2 లక్షల అప్పు తిరిగి చెల్లించాలని అడగడండ చివరకు ఒక యువకుడి ప్రాణం తీసింది.మునియప్ప కుమారుడు డిల్లీబాబు వ్యవసాయం చేస్తుండగా, అదే ప్రాంతానికి చెందిన మురుగేష్ కుమారుడు సాయికుమార్ (25) సెంట్రింగ్ పనులు చేసేవాడు. ఇద్దరూ బంధువులు, స్నేహితులే. కొన్ని నెలల క్రితం డిల్లీబాబు సాయికుమార్ వద్ద నుంచి రూ.2 లక్షలు అప్పుగా తీసుకున్నాడు.అప్పు తిరిగి చెల్లించకపోవడంతో సాయికుమార్ పలుమార్లు అడుగుతూ వచ్చాడు. బుధవారం మళ్లీ డబ్బు తీర్చాలని ఒత్తిడి చేయడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఆవేశానికి గురైన డిల్లీబాబు నాటు తుపాకీతో సాయికుమార్ ముఖంపై కాల్పులు జరిపాడు. బాధితుడు అక్కడికక్కడే మృతి చెందాడు. చిత్తూరు తాలూకా పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. వేట కోసం తమిళనాడులో నాటు తుపాకీ కొనుగోలు చేసినట్లు సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఒక్క క్షణం ఆవేశండ ఒక కుటుంబాన్ని శాశ్వతంగా చీకట్లోకి నెట్టింది. అప్పు, డబ్బు, వివాదాలు ఏవైనా సరేడ ప్రాణం కంటే పెద్దవి కావు

## మద్యం మత్తులో తల్లిపై కుమారుడి దాడి ప్రాణాపాయ స్థితిలో మహిళ

**మన దునియా,మహబూబాబాద్ జిల్లా:మార్చి 05**



మహబూబాబాద్ జిల్లాలో ఘోర ఘటన చోటుచేసుకుంది. తొర్రూరు మండలం చర్లపాలెం గ్రామానికి చెందిన చిట్టిమల్ల లచ్చమను ఆమె కుమారుడు అజీమ్ మద్యం మత్తులో గొడ్డలితో దాడి చేసిన సంఘటన తీవ్ర కలకలం రేపింది.సమాచారం ప్రకారం, మద్యం మత్తులో ఉన్న అజీమ్ అకస్మాత్తుగా తల్లి లచ్చమపై గొడ్డలితో దాడి చేశాడు. ఈ దాడిలో లచ్చమకు రెండు చేతులు మరియు మెడ వద్ద తీవ్ర గాయాలు అయ్యాయి. దాడి అనంతరం ఆమె ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతూ ఉండగా స్థానికులు వెంటనే గమనించి ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ దారుణ ఘటన గ్రామంలో తీవ్ర ఆందోళనకు దారి తీసింది.

## “ఎంజీఎం“ లో జూనియర్ డాక్టర్ల తీరుపై విమర్శలు..!

**రిపోర్టర్లపై బెదిరింపులు? వాట్సాప్ గ్రూపుల్లో ఆరోపణలు?**

**మన దునియా,వరంగల్:మార్చి 05**

ప్రభుత్వ ఆసుపత్రి అయిన ఎంజీఎం హాస్పిటల్‌లో ఇటీవల జరిగిన ఒక ఘటన నేపథ్యంలో కొందరు జూనియర్ డాక్టర్ల వ్యవహార శైలిపై విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఒక సంఘటనకు సంబంధించి వాట్సాప్ గ్రూపుల్లో ఒక సీనియర్ రిపోర్టర్ పేరు ప్రస్తావిస్తూ మెసేజ్‌లు షేర్ అయినట్లు సమాచారం వెలువడటంతో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.సమాచారం ప్రకారం ఇటీవల ఎమర్జెన్సీ విభాగంలో జరిగిన ఒక ఘటనకు సంబంధించి “ఒక సీనియర్ రిపోర్టర్‌కు సంబంధించిన వ్యక్తులు వచ్చి డాక్టర్లతో వాగ్వాదానికి దిగారు” అనే విధంగా కొందరు జూనియర్ డాక్టర్లు తమ వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు పెట్టినట్లు తెలిసింది. అయితే సంఘటనపై పూర్తి వివరాలు తెలియకుండానే ఒక రిపోర్టర్ పేరు ప్రస్తావిస్తూ ప్రచారం జరగడం ఎంతవరకు సమంజసం అన్న ప్రశ్నలు జర్నలిస్ట్ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి.ఇక నిన్న రాత్రి జరిగిన సంఘటనపై మరో కోణం కూడా వినిపిస్తోంది. రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఒక సీనియర్ రిపోర్టర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందిందని, తనకు తెలిసిన వ్యక్తికి రోడ్డు ప్రమాదం జరిగి ఆసుపత్రి ఎమర్జెన్సీ విభాగానికి తీసుకువచ్చారని, అక్కడ సరైన స్పందన లేదని చెప్పడంతో ఆయన ఆసుపత్రికి చేరుకున్నట్లు తెలిసింది. ఆ సమయంలో అక్కడ నెలకొన్న గొడవ పరిస్థితులను వీడియోగా చిత్రీకరించినట్లు సమాచారం.ఈ విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. అక్కడికి అంత బాగానే ఉంది. ఎక్కడి వాళ్ళు అక్కడికి వెళ్ళిపోయారు.అయితే ఆ తరువాత కొందరు జూనియర్ డాక్టర్ల వాట్సాప్ గ్రూపుల్లో “రిపోర్టర్ పేరు ప్రస్తావిస్తూ“ రెచ్చగొట్టేలా జరిగిన సంభాషణలు జరిగాయి. దీనిపై పోర్టర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.. ఇక మరోవైపు ఎంజీఎం ఆసుపత్రిలో రిపోర్టర్లు ఫోటోలు, వీడియోలు తీయకుండా కొందరు అడ్డుకుంటున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే గతంలో జరిగిన రివ్యూ సమావేశంలో రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ప్రభుత్వ గుర్తింపు కార్డు (అక్రిడిటేషన్) కలిగిన రిపోర్టర్లు ప్రజలకు సంబంధించిన అంశాలను కవర్ చేయడానికి ఆసుపత్రిలో ఫోటోలు, వీడియోలు తీసుకోవచ్చని పేర్కొన్న విషయం గుర్తుచేస్తున్నారు.ఈ నేపథ్యంలో ఆసుపత్రిలో జరిగిన ఘటనపై స్పష్టత రావాలని, వాస్తవాలు బయటకు రావాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అలాగే ఇలాంటి వివాదాలు తలెత్తకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందని స్థానిక వర్గాలు సూచిస్తున్నాయి. అధికారులు ఘటనపై సమగ్రంగా పరిశీలించి వాస్తవాలు వెల్లడించాలని పలువురు కోరుతున్నారు.

## బిఆర్ఎస్ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు విచ్చేసి నూతన దంపతులను ఆశీర్వదించారు





**మన మంగపేట (మన దునియా న్యూస్) పిబ్రవరి:05**

మంగపేట మండలం నరసింహ సాగర్ గ్రామంలో మాజీ మండల బిఆర్ఎస్ అధ్యక్షులు కదారి రాజన్న కుమార్తె వివాహానికి ములుగు జిల్లా టిఆర్ఎస్ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు విచ్చేసి నూతన దంపతులను , నిండు నూరేళ్లు సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు, తదుపరి ఆయన మాట్లాడుతూ కార్యకర్తల కష్టసుఖాల్లో మంచిచెడులల్లో మేము ఎప్పుడు తోడుంటాం, మంచికి ఆశీర్వాదమై నిలుస్తాం, కష్టం వస్తే భరోసై నీ పక్కన ధైర్యంగా ఎప్పుడూ నిలుస్తా అని లక్ష్మణ్ బాబు గారు కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు, ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున బిఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు..

## కొలెస్ట్రాల్ ఉన్న వారు నెయ్యి తినవచ్చా..?



నెయ్యి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. నెయ్యిలో పోషకాలతో పాటు ఔషధ గుణాలు పుష్కలంగా దాగున్నాయి.. నెయ్యి తీసుకోవడం వల్ల శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. నెయ్యిలో అనేక విటమిన్లు, కాల్షియం, పొటాషియం ఉన్నాయి. ఇది కాకుండా, నెయ్యిలో ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా ఉన్నాయి. నెయ్యి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. నెయ్యిలో పోషకాలతో పాటు ఔషధ గుణాలు పుష్కలంగా దాగున్నాయి.. నెయ్యి తీసుకోవడం వల్ల శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. నెయ్యిలో అనేక విటమిన్లు, కాల్షియం, పొటాషియం ఉన్నాయి. ఇది కాకుండా, నెయ్యిలో ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా ఉన్నాయి. శరీరానికి శక్తి రావాలంటే నెయ్యి తినాలని నిపుణులు చెబుతున్నారు. నెయ్యి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.. చర్మం, జుట్టు సమస్యలను కూడా నయం చేస్తుంది. నెయ్యి పోషకాలకు పవర్ హౌస్‌గా పేర్కొంటారు. శరీరానికి ఎంతో అవసరమైన విటమిన్-ఎ, విటమిన్-ఇ, విటమిన్-బి విటమిన్ కే తోపాటు విటమిన్ డి పుష్కలంగా ఉంటాయి.. అంతేకాకుండా.. ఒమేగా -3, ఒమేగా-6 వంటి ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్లు, లినోలిక్, బ్యుటిరిక్ యాసిడ్స్ వంటి పోషకాలు ఉన్నాయి. నెయ్యిలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. అయితే, ప్రస్తుత కాలంలో కొలెస్ట్రాల్‌తోపాటు ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో కొలెస్ట్రాల్ సమస్యలు ఉన్నవారు నెయ్యిని తినవచ్చా.. లేదా..? తింటే ఏమవుతుంది..? ఒకవేళ తింటే ఎంత తినాలి.. అనే ప్రశ్నలు సాధారణంగా ప్రతి ఒక్కరినీ వెంటాడుతున్నాయి. ఆయుర్వేదంలో ఔషధ వినియోగం: నెయ్యిలోని పోషకాలు, విశిష్ట లక్షణాల కారణంగా ఆయుర్వేదంలో ఔషధంగా ఉపయోగిస్తారు. నెయ్యి శరీరంలో మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతూ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుందని పేర్కొంటున్నారు ఆయుర్వేద నిపుణులు..కొలెస్ట్రాల్ సమస్య ఉన్నవారు కూడా నెయ్యి తినవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.. అయితే.. రోజుకు కేవలం 2 నుంచి 3 స్పూన్లు నెయ్యి మాత్రమే తీసుకోవడం మంచిది.. అంతకు మించి నెయ్యి తీసుకోకూడదని పేర్కొంటున్నారు.కాబట్టి శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరగకుండా జాగ్రత్తపడాలి. చెడు కొలెస్ట్రాల్ పెరగడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని పేర్కొంటున్నారు.. కొలెస్ట్రాల్ ఉన్నవారు ముందుగా వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకుని.. వారి సూచనల ప్రకారం.. నెయ్యిని తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.



# బెథెల్ భయపెట్టినా విజయం మనదే.. వరుసగా రెండోసారి ఫైనల్లో భారత్..!




పొట్టి ప్రపంచకప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ భారత జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. భారీ స్కోర్ల మ్యాచ్‌లో ఇంగ్లండ్ కడదాకా పోరాడిన వాంఖడేలో విజయంతో మురిసింది. జాకబ్ బెథెల్(105) భయపెట్టినా.. బుమ్రా(33-1), పాండ్యా(2-38)లు డెత్ ఓవర్లలో అద్భుతంగా బౌలింగ్ చేసి ప్రత్యర్థిని పడగొట్టారు. మ్యాచ్ చేజారుతున్న వేళ బౌండరీ లైన్ వద్ద అక్షర్ పటేల్.. తిలక్ వర్మ పట్టిన క్యాచ్‌లు భారత విజయంలో కీలకమయ్యాయి.ఉత్కంఠ రేపిన రెండో సెమీఫైనల్లో భారత్ అద్భుత విజయం సాధించింది. వెస్టిండీస్‌ను ఓడించిన ఆత్మవిశ్వాసంతో వాంఖడేలో ఇంగ్లండ్ బౌలర్లను ఉతికేస్తూ 253 రన్స్ కొట్టిన టీమిండియా.. రికార్డు ఛేదనలో ప్రత్యర్థి గొప్పగా పోరాడినా 246కే కట్టడి చేసింది. వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్ ఫీల్డింగ్ మెరుపులు.. బుమ్రా, హార్దిక్ బౌలింగ్ టీమిండియాను గెలిపించాయి. 7 పరుగులతో విక్టరీ కొట్టిన టీమిండియా.. ఇంగ్లండ్‌పై వరుసగా రెండోసారి సెమీస్‌లో పైచేయి సాధించింది.చివరి ఓవర్లో 30 రన్స్ అవసరమవ్వగా.. దూబే బంతి అందుకున్నాడు. సెంచరీతో జోరుమీదున్న బెథెల్ క్రీజులో ఉండడంతో అందరిలో ఉత్కంఠ. కానీ, స్ట్రెయిట్‌గా ఆడిన బెథెల్ రెండు పరుగులు తీసే క్రమంలో రనౌటయ్యాడు. అంతే.. భారత ఆటగాళ్లు అభిమానులు సంబురాల్లో మునిగిపోయారు. వరుసగా మూడు బంతుల్ని జోఫ్రా ఆర్చర్(19 నాటౌట్) సిక్సర్లుగా మలిచాడు. 240 పరుగులకే పరిమితమైంది. వికెట్ల తేఆతో గెలుపొందిన భారత్ ఆదివారం న్యూజిలాండ్‌తో టైటిల్ పోరులో తలపడనుంది.

హార్దిక్ రెండో ఓవర్లోనే

భారీ ఛేదనలో రెండో ఓవర్లోనే హార్దిక్ పాండ్యా వికెట్ అందించాడు. ఫామ్‌లో లోని ఫిల్ సాల్ట్(5)ను ఔట్ చేసిన అతడు.. బుమ్రా ఓవర్లో హ్యారీ బ్రూక్(7) దొరికిపోయాడు. ఆ తర్వాత జాకబ్ బెథెల్(105) వరుణ్ చక్రవర్తి ఓవర్లో హ్యాట్రిక్ సిక్సర్లు బాదాడు. సింగిల్ తీయడమే పొరపాటైంది. ఆ తర్వాతి బంతికే పెద్ద షాట్ ఆడాలనుకున్న బట్లర్‌ను గూగ్లీతో బౌల్డ్ చేసిన వరుణ్ మూడో వికెట్ అందించాడు. కాసేపటికే అక్షర్ పటేల్ బౌలింగ్‌లో వరుసగా రెండు సిక్సర్లు బాదిన టామ్ బ్యాంటన్(17).. స్లో బంతికి బౌల్డయ్యాడు. దాంతో.. 95కే నాలుగు వికెట్లు పడ్డాయి. ఆ దశలో విల్ జాక్స్(35) జతగా రెచ్చిపోయాడు. సిక్సర్ల మీద సిక్సర్లు బాదిన ఈ చిచ్చరపిడుగు.. అర్ధ శతకంతో ఆశలు రేపాడు. 14వ ఓవర్లో వరుసగా మూడు వైడ్లు వేసినా.. అక్షర్ పటేల్ స్టన్నింగ్ క్యాచ్‌తో.. ఈ జోడీని విడదీసి.. 27 బంతుల్లోనే 50 రన్స్ రాబట్టిన.. సామ్ కరన్(18)ను తిలక్ బౌండరీ క్యాచ్‌తో పెవిలియన్ చేర్చాడు. అయినా.. క్రీజులో బెథెల్ ఉండడంతో ఇంగ్లండ్ విజయంపై ధీమాతో ఉంది. కానీ 18వ ఓవర్లో బుమ్రా ఆరు పరుగులు.. 19వ ఓవర్లో 9 రన్స్ ఇచ్చిన పాండ్యా వికెట్ తీశాడు. చివరి ఓవర్లో తొలి బంతికే బెథెల్ రనౌటవ్వగా.. భారత్ విజయం ఖాయమైంది. ఆఖరి మూడు బంతులకు ఆర్చర్(19 నాటౌట్) సిక్సర్లు సంధించగా.. ఇంగ్లండ్ 246కి పరిమితమైంది.

రెచ్చిపోయిన శాంసన్, దూబే

ఈడెన్ గార్డెన్స్‌లో వెస్టిండీస్‌పై చెలరేగిన సంజూ శాంసన్(89) ఇంగ్లండ్ బౌలర్ల భరతం పట్టగా.. మిడిలార్డర్లో శివం దూబే(43) ఉతికేశాడు. వరుసగా రెండో అర్ధ శతకంతో భారీ స్కోర్‌కు సంజూ బాటలు వేయగా.. ఇషాన్ కిషన్(39) దూబే మెరుపులతో రాకెట్ వేగంతో పరుగులు వచ్చాయి. డెత్ ఓవర్లలో హార్దిక్ పాండ్యా(27), తిలక్ వర్మ(21)లు తమమార్క్ విధ్వంసంతో కదం తొక్కగా టీమిండియా 253 పరుగులతో ప్రత్యర్థికి కష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించింది.

# ఐదు రోజులుగా కోల్‌కతాలోనే.. మమ్మల్ని ఎప్పుడు పంపిస్తారు..!



పశ్చిమాసియాలో యుద్ధం ప్రభావం వెస్టిండీస్ జట్టుపై పడింది. పొట్టి ప్రపంచకప్ సూపర్ 8 మ్యాచ్‌లో భారత జట్టు చేతిలో ఓడిన విండీస్ బృందం ఇంకా కోల్‌కతాలోనే ఉండిపోయింది. యుద్ధం కారణంగా విమాన సర్వీసులు రద్దైన నేపథ్యంలో కరీబియన్ ఆటగాళ్లు స్వదేశం వెళ్లేందుకు పడిగాపులు కాస్తున్నారు. హెడ్‌కోచ్ డారెన్ సమీ (ఋతీవఅ ూఋఎఎం) అయితే.. తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాడు. నేను ఇంటికి వెళ్లాలనుకుంటున్నా అని ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో మార్చి 1 ఆదివారం సెమీస్ బెర్తు కోసం భారత్, వెస్టిండీస్ తలపడ్డాయి. కానీ, ఆ మ్యాచ్‌లో సంజూ శాంసన్ విధ్వంసంతో విండీస్ జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించింది. అమెరికా, ఇజ్రాయేల్ ఇరాన్ యుద్ధం కారణంగా వారిని వెంటనే పంపించలేని పరిస్థితి. దాంతో.. ఆ రోజు నుంచి ఇప్పటివరకూ కరీబియన్ ఆటగాళ్లు కోల్‌కతాలోనే ఉన్నారు.ఈ పరిస్థితుల్లో ఆ జట్టు హెడ్‌కోచ్ డారెన్ సమీ ఎక్స్ పోస్ట్‌లో తన ఆవేదనను వ్యక్తం చేశాడు. 'నేను ఇంటికి వెళ్లాలనుకుంటున్నా. మమ్మల్ని ఎప్పుడు పంపిస్తారో చెప్పండి. మేము కోల్‌కతాలోనే ఉండి ఐదు రోజులైంది. ఈరోజు.. రేపు.. కాంటే వచ్చే వారం.. ఏదో ఒక రోజు పంపిస్తామని అయినా చెప్పండి' అని సమీ తన పోస్ట్‌లో రాసుకొచ్చాడు. సమీ పోస్ట్‌లో వెస్టిండీస్ క్రికెట్‌గానీ, భారత క్రికెట్ నియంత్రణ మండలిగానీ ఇంకా స్పందించలేదు.

# హోటల్ మహిళా సిబ్బందితో అనుచితంగా ప్రవర్తించిన పాకిస్థాన్ క్రికెటర్

కొలంబో: పాకిస్తాన్ క్రికెటం ఒకరు హోటల్ మహిళా సిబ్బందితో అనుచితంగా ప్రవర్తించినట్లు తెలిసింది. టీ20 వరల్డ్‌కప్(ు20 ఔశీతీశ్రీ‌స జబజూ)లో సూపర్ 8 స్టేజ్‌లో శ్రీలంకతో మ్యాచ్ జరగడానికి ముందు కాండీ హోటల్‌లో ఈ ఘటన జరిగింది. హోటల్‌లోని హౌజ్ కీపింగ్‌కు చెందిన మహిళా సిబ్బందితో అనుచితంగా వ్యవహరించిన ఆ క్రికెటర్‌కు జరిమానా కూడా వేసినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ వరల్డ్ కప్ జట్టులోని ఓ సభ్యుడు ఫిమేల్ హౌజ్‌కీపింగ్ సిబ్బందితో తప్పుగా ప్రవర్తించినట్లు ఓ మీడియా తన కథనంలో పేర్కొన్నది. ఆ మహిళ గట్టిగా అరవడంతో .. అక్కడ ఉన్న హోటల్ సిబ్బంది ఆమెను రెస్క్యూ చేసినట్లు తెలిసింది.ఈ విషయాన్ని పాకిస్థాన్ క్రికెట్ టీమ్ మేనేజర్ నవీద్ చీమాకు ఫిర్యాదు చేశారు. అయితే గోల్డెన్ క్రౌన్ హోటల్ సిబ్బంది మాత్రం ఈ విషయాన్ని సిరీయస్‌గా తీసుకున్నారు. కఠిన శిక్ష విధించాలన్నారు. అయితే పాక్ టీం మేనేజర్ చీమా ఆ ఘటన పట్ల క్రికెటర్ తరపున క్షమాపణలు చెప్పారు. సూపర్ 8 స్టేజ్ ఆఖరి మ్యాచ్‌లో పాకిస్థాన్ నెగ్గినా.. సెమీస్‌లోకి ప్రవేశించలేకపోయింది. హౌజ్‌కీపింగ్ సిబ్బందితో అనుచితంగా వ్యవహరించిన ఆ క్రికెటర్‌పై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు క్రమశిక్షణా కమిటీ చర్యలు తీసుకోనున్నది.



# వైభవంగా అర్జున్ టెండూల్కర్ వివాహం.. తరలివచ్చిన క్రీడా, సినీ ప్రముఖులు..!

భారత దిగ్గజం సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కం వివాహ బంధంలో అడుగుపెట్టాడు. ఆంత్రోప్రెన్యూర్ సానియా చందోక్(ూఖఅఋ జష్ట్రుఅసశీ౯)ను పెళ్లి చేసుకున్నాడు. ముంబైలో వీరి కల్యాణ వేడుక ఆద్యంతం.. వైభవంగా జరిగింది. కొత్త జంటను ఆశీర్వదించేందుకు క్రీడా, సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు భారీగా తరలి వెళ్లారు. నిరుడు ఆగస్టు 25వ తేదీన అర్జున్, సానియా చందోక్‌ల నిశ్చితార్థం జరిగింది. మార్చి ఆరంభంలోనే ముందస్తు పెళ్లి వేడుకల్లో సచిన్ దంపతులు, కుటుంబసభ్యులు సందడి చేశారు. సన్నిహితులు, బంధుమిత్రుల సమక్షంలో సౌత్ ముంబైలో అర్జున్, సానియాల పెళ్లి కన్నులపండువగా జరిగింది.కొత్త జంటను దీవించేందుకు మాజీ ఆటగాళ్లు పెద్ద సంఖ్యలో వచ్చారు. భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ (ముఖ్ష్రవఅసతీఖ ూఱఅస్త్రష్ట్ర ణష్ట్రశీఅఱ) భార్య సాక్షితో పాటు హాజరయ్యారు. వెటరన్ ప్లేయర్ సునీల్ గవాస్కర్,మాజీ కోచ్‌లు రాహుల్ ద్రవిడ్, అనిల్ కుంబ్లే, రవి శాస్త్రిలు సైతం కొత్త జంటను దీవించారు.టీమిండియా ప్రస్తుత కోచ్ గౌతం గంభీర్.. మాజీ హిట్టర్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ యూసుఫ్ పఠాన్‌లు సతీసమేతంగా విచ్చేశారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఐసీసీ ఛైర్మన్ జై షా, కామెంటేటర్ హర్ష భోగ్లే.. తదితరులు కొత్త దంపతులైన అర్జున్ సానియాకు అభినందనలు తెలిపారు.

అర్జున్.. సానియా నేపథ్యమిదీ

దిగ్గజ క్రికెటర్ సచిన్ వారసత్వాన్ని కొనసాగిస్తున్న అర్జున్ టెండూల్కర్ దేశవాళీ, ఐపీఎల్‌లో మెరుస్తున్నాడు. అయితే.. తండ్రిలా జాతీయ జట్టు తరఫున చెలరేగి ఆడే అవకాశం మాత్రం మనోడికి ఇంకా దక్కలేదు. పేస్ ఆల్‌రౌండరైన అర్జున్ టీమిండియాకు ఆడాలంటే మరింత రాటుదేలాల్సి ఉంది. వధువు సానియా చందోక్ విషయానికొస్తే తను ఒక ఆంత్రోప్రెన్యూర్.ముంబైలో ఆతిథ్యం, ఆహార రంగాల్లో ప్రసిద్ధి గాంచిన గాహీ కుటుంబం ఆమెది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకానమిక్స్‌లో చదివిన తను.. వెటర్నరీ టెక్నీషియన్ కూడా. ముంబైలో పెంపుడు జంతువుల కోసం సానియా మిస్టర్ పాస్(వీతీ౹ూఖఒం) అనే పెట్ స్పా నడుపుతోంది.



మన దునియా
RNI Number
మన అక్షరం – మన ప్రపంచం




## మరోసారి రియల్ హీరో అనిపించుకున్న సోనూ.. దుబాయ్ బాధితులకు ఆపన్నహస్తం

ఆపదలో ఉన్నవారికి నేనున్నానంటూ ముందుకొచ్చే నటుడు సోనూ సూద్ మరోసారి తన పెద్ద మనసును చాటుకున్నారు. అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా విమాన సర్వీసులు హఠాత్తుగా నిలిచిపోవడంతో దుబాయ్‌లో చిక్కుకుపోయిన వందలాది మంది ప్రయాణికులకు ఆయన అండగా నిలిచారు. విమానాలు రద్దు కావడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న వారికి ఉచితంగా వసతి కల్పిస్తానని ప్రకటించి, మరోసారి రియల్ హీరో అనిపించుకున్నారు. సహాయం కావాల్సిన వారు ఎలాంటి సందేహం లేకుండా తనను సంప్రదించాలని సోనూ సూద్ కోరారు. తన ఇన్‌స్టాగ్రామ్‌కు సందేశం పంపిస్తే, తన బృందం వెంటనే స్పందించి సహాయం అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ సహాయానికి ఎలాంటి షరతులు వర్తించవని, ఏ దేశస్థులైనా సరే కష్టాల్లో ఉన్నవారికి తోడుగా నిలబడటమే మన కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు. "ఇలాంటి సంక్షోభ సమయంలో మనుషులుగా ఒకరికొకరం అండగా ఉండటం చాలా ముఖ్యం" అని సోనూ సూద్ తన సందేశంలో తెలిపారు. సోనూ సూద్ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం ఇది మొదటిసారి కాదు. కరోనా మహమ్మారి దేశాన్ని అతలాకుతలం చేస్తున్న సమయంలో ముఖ్యంగా లాక్‌డౌన్ విధించినప్పుడు ఆయన చేసిన సేవలు అజరామరం. పట్టణాలు, నగరాల్లో చిక్కుకుపోయిన లక్షలాది మంది వలస కార్మికులను వారి సొంత ఊళ్లకు పంపేందుకు ప్రత్యేక బస్సులు, రైళ్లు, చివరికి విమానాలు కూడా ఏర్పాటు చేశారు. దేశ, విదేశాల్లో చిక్కుకున్న విద్యార్థులను, ఇతర భారతీయులను స్వదేశానికి రప్పించారు. ఆయన సేవలకు దేశవ్యాప్తంగా ప్రజలు నీరాజనాలు పలికారు. అప్పటి నుంచి ఆయన్ను అభిమానులు, ప్రజలు 'రియల్ హీరో'గా పిలుచుకుంటున్నారు. ఇప్పుడు మరోసారి విదేశాల్లో ఇబ్బందులు పడుతున్న వారికి సాయం చేయడానికి ముందుకు రావడంతో సోషల్ మీడియాలో ఆయనపై ప్రశంసల వర్షం కురుస్తోంది. సంక్షోభ సమయాల్లో మానవత్వానికి అసలైన చిరునామా సోనూ సూద్ అని నెటిజన్లు కొనియాడుతున్నారు. ఆయన ప్రకటనతో ధైర్యం పొందిన పలువురు ప్రయాణికులు ఇప్పటికే సహాయం కోసం సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది. కష్టకాలంలో ఆయన అందిస్తున్న భరోసా ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

## ఓటీటీకి అనశ్వర రాజన్ హిట్ మూవీ!

మలయాళంలో స్టార్ గా అనశ్వర

'ఛాంపియన్'తో టాలీవుడ్ ఎంట్రీ

కోలీవుడ్ వైపు నుంచి పెరుగుతున్న అవకాశాలు

ఈ నెల 6వ తేదీ నుంచి 'విత్ లవ్' ఓటీటీ స్ట్రీమింగ్

అనశ్వర రాజన్ .. మలయాళంలో మంచి క్రేజ్ ఉన్న హీరోయిన్. మలయాళంలో ఆమె చేసిన సినిమాలకి ఓటీటీలోను మంచి ఆదరణ లభించడంతో, తెలుగు వైపు నుంచి కూడా ఆమెను అభిమానించేవారున్నారు. 'ఛాంపియన్' సినిమాతో ఆమె టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చేసింది కూడా. అలాగే కోలీవుడ్ ఎంట్రీని కూడా పూర్తి చేసేసింది. జీవీ ప్రకాశ్ కుమార్ తో ఆమె చేసిన 'లక్కీ సూపర్ స్టార్' రీసెంటుగా ఓటీటీలోకి వచ్చింది. ఇక అభిషన్ జీవింత్ జోడీగా ఆమె చేసిన 'విత్ లవ్' సినిమా ఇప్పుడు ఓటీటీకి రావడానికి రెడీ అవుతోంది. అభిషన్ జీవింత్ పేరు చెప్పగానే గతంలో అతను దర్శకత్వం వహించిన 'టూరిస్ట్ ఫ్యామిలీ' సినిమా గుర్తుకు వస్తుంది. చిన్న సినిమాగా వచ్చి పెద్ద విజయాన్ని అందుకున్న సినిమా అది. అలాంటి అభిషన్ జీవింత్, ఈ సినిమాతో హీరోగా ఎంట్రీ ఇచ్చాడు. అతని సరసన అనశ్వర కథానాయికగా నటించిన ఈ సినిమా, ఫిబ్రవరి 6వ తేదీన థియేటర్లకు వచ్చింది. ఈ సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ హక్కులను 'నెట్ ఫ్లిక్స్' వారు సొంతం చేసుకున్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి ఈ సినిమాను అందుబాటులోకి తీసుకుని రానున్నారు. మదన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను, సౌందర్య రజనీకాంత్ నిర్మించారు. పెళ్లి చూపులలో భాగంగా మోనీషాను సత్య కలుసుకుంటాడు. గతంలో తాము ఒకే స్కూల్ లో చదువుకున్నామనే విషయాన్ని అప్పుడే వాళ్లు గ్రహిస్తారు. ఆ స్కూల్ కి వెళ్లి పాత ఫ్రెండ్స్ ను కలవాలని అనుకుంటారు. ఆ తరువాత ఏం జరుగుతుంది? అనేది కథ.





# మంచు మనోజ్ సినిమాలో మెరవనున్న రాశి ఖన్నా

పీరియాడిక్ విజువల్ వండర్‌గా తెరకెక్కుతున్న 'డేవిడ్ రెడ్డి'

బ్రిటీష్ కాలం నాటి కథాంశంతో తెరకెక్కుతున్న చిత్రం

ఐటెం సాంగ్ కోసం రాశి ఖన్నాను ఎంపిక చేసినట్టు టాక్

టాలీవుడ్ యాక్షన్ స్టార్ మంచు మనోజ్ తన తాజా చిత్రం 'డేవిడ్ రెడ్డి'తో వెండితెరపై ఒక భారీ పీరియాడిక్ విజువల్ వండర్‌ను ఆవిష్కరించబోతున్నారు. హనుమరెడ్డి యక్కంటి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్ ఫిల్మ్ నగర్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. ఈ పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామాలో మాస్ ఆడియన్స్‌ను ఉర్రూతలూగించే ఒక స్పెషల్ సాంగ్‌ను ప్లాన్ చేశారట. ఇందులో మనోజ్‌తో కలిసి స్టెప్పులు వేయడానికి గ్లామరస్ బ్యూటీ రాశి ఖన్నాను ఎంపిక చేసినట్లు సమాచారం. సీరియస్ కథాంశంతో సాగే ఈ సినిమాలో రాశి ఖన్నా చేసే ఈ ఐటెం సాంగ్ ఒక ఊపు ఊపుతుందని చిత్ర బృందం భావిస్తోంది. ఇక ఈ సినిమా కథా నేపథ్యం విషయానికొస్తే.. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిష్ పాలకుల గుండెల్లో నిద్రపోయిన 'డేవిడ్ రెడ్డి' అనే వీర యోధుడి పోరాట గాథ ఇది. ఆ కాలం నాటి పరిస్థితులను కళ్లకు కట్టేలా చూపిస్తూనే, మనోజ్ పాత్రను అత్యంత శక్తిమంతంగా తీర్చిదిద్దారు. ఈ సినిమాలో హీరో వాడే 700 కేజీల బరువున్న 'వార్ డాగ్' అనే స్పెషల్ బైక్ ఇప్పటికే సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇందులో మరియా రియాబోషప్క కథానాయికగా నటిస్తుండగా, KGF ఫేమ్ రవి బస్రూర్ సంగీతం ఈ భారీ చిత్రానికి ప్రధాన బలంగా నిలవనుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2O23/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com